News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 05 | సంచిక :110 | ఖమ్మం | ఆదివారం, మే 31, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad



## ఇరాన్ వద్ద ఎప్పటికీ అణ్వాయుధాలు ఉండకూడదు

- హర్మ్యాజ్‌ను పూర్తిగా తెరవాలి: ట్రంప్ డిమాండ్
- అమెరికా వైఖరిని తీవ్రంగా తిరస్కరించిన ఇరాన్
- ట్రంప్ అధ్వర్యంలో సిట్యుయేషన్ రూమ్ సమావేశం



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్వహించిన కీలక సిట్యుయేషన్ రూమ్ సమావేశం అనంతరం కూడా అమెరికా– ఇరాన్ మధ్య ఒప్పందంపై ఎలాంటి తుది నిర్ణయం వెలువడలేదు. ఇరాన్‌కు సంబంధించిన అంశాలపై ఫైనల్ డిటర్మినేషన్ తీసుకునేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు ట్రంప్ ముందుగానే ప్రకటించడంతో అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది. అయితే దాదాపు రెండు గంటల పాటు సాగిన సమావేశం ముగిసిన తర్వాత కూడా వైట్ హౌస్ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.సమావేశం అనంతరం వైట్ హౌస్ అధికారి విడుదల చేసిన ప్రకటనలో,

వివరాలు 2లో..

## మోసపు హామీలతో గద్దెనెక్కి దగా

### కాంగ్రెస్ పాలనలో రైతులు మోసపోయారు

### బిజెపి ప్రజల్లోకి వెళితే తప్ప ప్రభుత్వం మేల్కోలేదు

### కేంద్రాన్ని విమర్శించడం తప్ప చేసిందేమీ లేదు

### మీడియా సమావేశంలో మండిపడ్డ కిషన్ రెడ్డి



మార్పు పేరుతో దొంగ మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. తెలంగాణ రైతాంగం పట్ల నిర్లక్ష్యంగా నిస్సిగ్గుగా వ్యవహరిస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని విధంగా దళారులు, ప్రభుత్వం, రైస్ మిల్లర్ల చేతిలో రైతులు విలవిల్లాడుతున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వం చేతకాని తనం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. మంత్రులు ఏసీ రూముల్లో గడిపారని..

వివరాలు 2లో..

## రాజస్థాన్‌లో ఇసుక తుఫాన్

- బలమైన ధూళితో కమ్ముకున్న చీకట్లు
- భాయందోళనలకు గురైన ప్రజలు



రాజస్థాన్ రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. శనివారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇసుక తుపాను తీవ్ర బీభత్సం సృష్టించింది. థార్ ఎడారి నుంచి వీచిన బలమైన గాలుల కారణంగా ఆకాశమంతా ఇసుక రేణువులు కమ్ముకొని, పగటిపూటే ఒక్కసారిగా చీకట్లు ముసురుకోవడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. ముఖ్యంగా పశ్చిమ రాజస్థాన్‌లోని చురు, బీకనీర్, హనుమాన్‌గఢ్, గంగానగర్ జిల్లాలపై ఈ తుపాను ప్రభావం తీవ్రంగా చూపింది. చురూ పరిసర ప్రాంతాల్లో గంటకు 60 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో భీకరమైన ఈదురు గాలులు వీచాయి. భారీ

వివరాలు 2లో..

## మోటర్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో

# పోటీచేయను

## ఉచిత విద్యుత్ ఆపేసినా రాజకీయాల నుంచి తప్పకుంటా

- లేపకుంటే బీఆర్ఎస్ రాజకీయాల నుంచి తప్పకుంటుందా
- రైతుల ముసుగులో లబ్ధికి కేసీఆర్ రాజకీయ ఎత్తుగడలు
- ధాన్యం కొనుగోళ్లలో కేంద్రం తీరు దుర్మార్గం
- కొనకపోతే బీజేపీ ఎంపీల ఇళ్లముందు ధాన్యం పోస్తాం
- హరీశ్‌రావు భవిష్యత్తు ఆయన చేతుల్లోనే లేదు
- మహేశ్ గౌడ్‌ది నాది విన్నింగ్ కాంబినేషన్
- మీడియా చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ నిలిపివేసినా, మోటార్లకు మీటర్లు పెట్టినా తాము ఎన్నికల్లో పోటీ చేయబోమని, ఈ సవాల్‌కు బీఆర్ఎస్ సిద్ధమా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేస్తూ.. రాజకీయ లబ్ధి కోసమే కేసీఆర్ రైతుల ముసుగులో లైఫ్ లైన్ కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దేశంలోనే తొలిసారిగా రైతుల కోసం ప్రత్యేకంగా 'రైతు డిస్కం' ఏర్పాటు చేశామని, దీనివల్ల ప్రభుత్వానికి తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేసే వెసులుబాటుతో పాటు జవాబుదారీ తనం పెరుగుతుందని స్పష్టం చేశారు. భారత రాష్ట్ర సమితికి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. మోటార్లకు మీటర్లు పెడితే, రైతులకు ఉచిత విద్యుత్ నిలిపివేస్తే.. తాము ఎన్నికల్లో పోటీ చేయబోమన్నారు.

మిగతా 12లో..

## తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపు

### జూన్ 4న అఖిలపక్ష భేటీ జరపాలని నిర్ణయం

### ఉన్నతాధికారులతో కేశవరావు కమిటీ తొలి భేటీ

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం నియమించిన కమిటీ శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో చైర్మన్ డా. కె. కేశవరావు అధ్యక్షతన సమావేశం అయ్యింది. కమిటీ సభ్యులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి లు

వివరాలు 2లో..

## పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం

### సీబీఎస్ఈ మూల్యంకలనంలో లోపాలు దారుణం

### అసమర్థ వ్యవస్థలపై దేశాన్ని నిర్మించలేమన్న కేటీఆర్

### విద్యార్థులకు అండగా పోరాడుతామని ప్రకటన

దేశంలో నీట్ పరీక్షల అక్రమాలపై రేగిన వివాదం ఇంకా చల్లబడకముందే, భారతీయ విద్యా వ్యవస్థ ప్రతిష్టను మరింత మసకబారుస్తూ సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాల వివాదం తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. ఇటీవలే విడుదలైన సీబీఎస్ఈ ఫలితాలలో డిజిటల్ మూల్యాంకనం లోపాల కారణంగా తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ మార్కుల తారుమారు వ్యవహారం దేశవ్యాప్తంగా దాదాపు 18.5 లక్షల మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనలో ముంచెత్తింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. న్యాయం కోసం ఉధృతంగా పోరాడుతున్న విద్యార్థులకు

వివరాలు 2లో..



## తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపు

మొదటిపేజీ తరువాయి..

సంబంధిత ఉన్నతాధికారులతో జరిపిన ఈ సమావేశంలో విధి విధానాలు, ఉద్యమకారుల సమాచార సేకరణ తదితర అంశాలపై చర్చించారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం ఈ నెల 15వ తేదీన జివో .679 జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కమిటీ సచివాలయంలో మొదటి సారి నేడు సమావేశమైంది. జూన్ 4వ తేదీన అన్ని పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి తగు సూచనలు, సలహాలు స్వీకరించాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనాడు ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వారందరిని గుర్తించి ప్రభుత్వం సముచితంగా గౌరవించాలని ప్రభుత్వ లక్ష్యమని కమిటీ చైర్మన్ డా. కె. కేశవరావు తెలిపారు. అమరవీరుల కుటుంబాలు, తెలంగాణ ఉద్యమం తొలి, మలి దశ లలో క్షేత్రస్థాయిలో ఉద్యమంలో పాల్గొన్న వారి వివరాలు సేకరించి పారదర్శకంగా అర్హుల జాబితా తయారీకి తగు కార్యాచరణ రూపొందించాలని అధికారులను కమిటీ ఆదేశించింది.

## జనాభా కాదు..మౌళిక వసతులు ఆలోచించండి!

దేశంలో ప్రస్తుతం ఉన్న జనాభాకే సరైన మౌళిక సదుపయాలు లేవు. విద్య,వైద్యం అందించే స్థితిలో ప్రభుత్వాలు లేవు. అలాగే నిత్యావసరాలు అందడం లేదు. ఉండడానికి ఇల్లు లేదు. దేశంలో అత్యధిక జనాభాకు కనీస గూడు కూడా కరువే. ఘనత వహించిన పాలకుల తీరు కారణంగా ప్రజలు నానా అగచాట్లు పడుతున్నా పాలకులకు పట్టింపు లేదు. ధాన్యం దిగుబడులు పెరుగుతున్నా, వాటిని సకాలంలో సేకరించే యంత్రాంగం లేదు. ఉన్న జనాభాను పనులకు ఉపయోగించుకునే తెలివి లేకుండా పోయింది. ఇదంతా కూడా కేవలం వ్యవస్థాగత లోపంతో పాటు, పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడం, పరిపాలనానుభం లేకపోవడం ప్రధాన కారణంగా చూడాలి. ఇలాంటి సమయంలో ఈ మధ్య ఎపి సిఎం చంద్రబాబు పిల్లలను కనండి.. డబ్బులు పడేస్తాను అంటూ ప్రచారంతో ఊదరగొడుతున్నారు. తను ఒక్క కొడుకునే కన్నాడు. తన కొడుకు లోకేశ్ కూడా ఒక్క పిల్లాడిని కని మిన్నకున్నారు. చంద్రబాబు పిలుపు ఇంటికి పనికిరాదా అన్నది చెప్పాలి. కనీస మౌళిక వసతులు కల్పించేందుకు చంద్రబాబు పనిచేస్తున్నారా అన్నది చెప్పాలి. ఇవేవీ కల్పించ కుండా పిల్లలను కని పడేసతే వారికి తిండి,బట్ట, చదువుసంధ్యా, వైద్యం ఎవరు అందిస్తారో చెప్పాలి. ఇందుకు గ్యారెంటీ ఇవ్వగలరా అన్నది చెప్పాలి. ఇప్పుడున్న పిల్లలకు ఈ రకమైన వసతులు కల్పించడానికి ఏం చేస్తున్నారో చంద్రబాబుతో సహా పాలకులంతా ప్రకటించాలి. దేశాన్ని అభివృద్ధి వైపు తీసుకుని వెళ్లే బదులు ఇలా తిరోగమనం వైపు తీసుకుని వెళ్లే యత్నంలో రాజకీయ కోణం తప్ప మరోటి లేదు. జనాభా నియంత్రణ లేకపోవడంతో దేశంపై ఎంతగా భారం పడుఉతందో చెప్పడం లేదు. ప్రజలు త్యాగాలు చేస్తుంటే... నాయకులు భోగాలు అనుభవిస్తున్నారు. కేవలం సీట్లు పెంచుకోవడం అన్న ధ్యాస తప్ప మరోటి లేదు. జనాభా పెరిగితే రేపటి అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లలో కోత ఉండదన్న దురుద్దేశం ఇందులో దాగి ఉందనడంలో సందేహం లేదు. దక్షిణాది రాష్ట్రాల జనాభా పెరుగుదల రేటు గణనీయంగా తగ్గిన కారణంగా నియోజక వర్గాల పునర్విభజన జరిగితే, నష్టపోతాం కనుక జనాభాను పెంచాల్సి ఉందని,అందుకు మహిళలు ఎక్కువ మంది పిల్లలను కనాలని చంద్రబాబు నాయుడు సెలవిచ్చారు. ఎక్కడకు వెళ్లినా , కార్యక్రమం ఏదైనా జనాభా పెంచాల్సిన అవసరాన్ని నొక్కి చబుతున్నారు. ముగ్గురు అంతకన్నా ఎక్కువ మంది పిల్లలను కనే మహిళలకు, పిల్లలకు ప్రోత్సాహకాలను కూడా ప్రకటించారు. మూడవ సంతానానికి రూ.30 వేలు, నాల్గవ సంతానానికి రూ.40 వేలు నగదు సహాయం చేస్తామని, ఆర్థికాభివృద్ధి బాగుంటే మరింత ఎక్కువ ఇవ్వడానికి కూడా సిద్ధమని ప్రకటించారు. అసలు ఈ పిల్లలను కనడానికి కనీసం ఆస్పత్రి సౌకర్యాలు లేని ఎన్నో గ్రామాలు ఉన్నాయి. ముందుగా ఆయా గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలన్న ఆలోచన కూడా రావడం లేదు. ఎవరి ప్రయోజనాల కోసం మహిళలు ఎక్కువ మంది పిల్లలను కనాలో చెప్పాలి. పిల్లను కనడం వల్ల వచ్చే సౌలభ్యం ఏమిటో చెప్పాలి. ఈ ప్రోత్సాహకాలు ప్రకటించడం ద్వారా గ్రామీణ మహిళల కుటుంబాల్లో డబ్బు కోసం ఒత్తిడి పెరుగుతోంది. ఈ విషయం చంద్రబాబు గ్రహించినట్లు లేదు.ప్రోత్సాహకాలు మాత్రమే మహిళలు ఆరోగ్యంగా, గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి, పిల్లలు సురక్షితమైన వాతావరణంలో పెరగడానికి అవకాశాలు కల్పిస్తాయని భరోసా ఇవ్వగలరా అన్నది చెప్పాలి. కార్పొరేట్ సంస్థలకు చౌకగా శ్రామికులను సరఫరా చేయడానికి, మహిళలను ఇంటికి పరిమితం చేయడానికి మాత్రమే ఇది ఉపయోగ పడుతుంది. దేశ జనాభా ఇప్పటికే విపరీతంగా పెరిగింది. బాల్యం అంతా వెట్టిలో సాగుతోంది. జనాభా పెరుగుదల దేశంలో అసమానతలను పెంచింది. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అభద్రత, హింస, అత్యాచారాలు, అశాంతి పెరిగినట్లుగా అన్ని గణాంకాలు, నివేదికలు తెలియచేస్తున్నాయి. మహిళల విద్య, ఉపాధి, పౌష్టికతకు సంబంధించిన అంశాలలో వెనకబడుతున్నాం. ఇటువంటి దుర్భర పరిస్థితులలో ఎక్కువ మంది పిల్లల్ని కనండి అని సూచించడం ద్వారా గ్రామీణ కుటుంబాల్లో భారం మోపడం తప్ప మరోటి కాదు. పిల్లను కనడానికి సరైన ఆస్పత్రులు లేవు. పెంచడానికి సరైన భద్రత లేదు. పెంచిన తరవాత చదివించేం దుకు సరైన పాఠశాలలు లేవు. వారిని సమర్థులైన పౌరులుగా తీర్చిదిద్దడానికి అనువైన వాతావరణం లేదు. ఇవన్నీ ఒక ఎత్తయితే మహిళలు పిల్లల్ని కనే క్రమంలో శారీరక, మానసిక మార్పులు, ఒత్తిళ్లకు లోనుకావాల్సి ఉంటుంది. వాటిని అధిగమించడానికి అవసరమైన వైద్యం ఎక్కువ శాతం మహిళలకు అందుబాటులో లేదు. మరీ ముఖ్యంగా గ్రామీణ, గిరిజన మహిళలకు ఇలాంటి సమస్య ఎక్కువ. డోలీ లేకుండా గర్భిణిని తరలించే సౌకర్యం కల్పించని పాలకులు ఇఇ గుర్తుకు రావడం లేదు. సమాజంలో మార్పులు వస్తున్నా, ఆర్థిక స్వాతంత్ర్యం పెరిగినా ఇంకా మహిళలు అణచివేతకు గురవుతున్నారు. 21 ఏళ్లు నిండినప్పటి నుంచి మహిళల మీదపెళ్లి ఒత్తడి పెరుగుతంది. పెళ్లి అయితే పిల్లలను కనమని ఒత్తిడి కుటుంబ సభ్యుల నుంచి ఉంటుంది. ఇక ప్రోత్సాహకాలు ఇస్తున్నారంటే ఆ ఒత్తిడి మరింత తీవ్రంగా ఉంటుంది. ఇప్పటికే చాలా మంది మహిళలు కెరీర్, కుటుంబం రెండింటిని బ్యాలెన్స్ చేసుకోవడంలో అనేక ఒత్తిళ్లకు గురవుతున్నారు. వెనకటికి లాగా ఉమ్మడి కుటుంబాలు లేవు. నాణ్యమైన విద్య, వైద్య సదుపాయాలు అందరికీ అందుబాటులో ప్రభుత్వ అజమాయిషీలో తీసుకుని రావడంపై ముందుగా పాలకలు దృష్టి సారించాలి. ఇస్తామన్న ప్రోత్సాహక డబ్బు ఇందుకోసం వెచ్చించాలి. అందరూ ఉపాధిని హక్కుగా పొందగలిగేలా పరిస్తితిని సృష్టించాలి. స్కూళ్లతో పాటు ఆటస్థలాలు, పార్కులు, సాంస్కృతిక వికాసం కోసం లైబ్రరీలు, పాటలు, డాన్సులు నేర్పే సంస్థలను కూడా ప్రభుత్వమే ఏర్పాటు చేయాలి. అప్పుడు జనాభా నియంత్రణను ఎవ్వరు కూడా పాటించరు.

# ఎస్ఐఆర్‌పై విమర్శలు సరికాదు

మొదటిపేజీ తరువాయి..

ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రపంచంలోనే అత్యంత కచ్చితమైన ఓటర్ల జాబితాల్లో ఒకటని అభిప్రాయపడ్డారు. రేయింబవళ్లు ప్రతికూల ఒత్తిళ్లు ఎదురవుతున్నప్పటికీ పూర్తి పారదర్శకతతో ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తున్నందుకు ఎన్నికల అధికారులను ప్రశంసించారు. దిల్లీలో జరిగిన ఓ సమావేశంలో పాల్గొన్న జ్ఞానేశ్ కుమార్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. "15 లక్షలకు పైగా బూత్ స్థాయి ఏజెంట్లు, అన్ని జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీల జిల్లా, రాష్ట్ర అధ్యక్షుల పర్యవేక్షణలో 11 లక్షలకు పైగా బూత్ స్థాయి అధికారులు, అసిస్టెంట్ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, ఎన్నికల రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు ఈ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణను రూపొందిస్తున్నారు. ఈ ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొన్నవారందరూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు. వారందరూ ప్రపంచంలోనే అత్యంత కచ్చితమైన ఓటర్ల జాబితాల్లో ఒక దానిని తయారుచేయడానికి ఎన్నికల సంఘానికి డిప్యూటేషన్‌పై ఉన్నారు. సీఈసీతో కలిసి పనిచేస్తున్న దేశంలోని ప్రముఖ న్యాయవాదులందరికీ, అలాగే 11 లక్షల బూత్ స్థాయి అధికారులు, 15 లక్షల బూత్ స్థాయి ఏజెంట్లకు వందనాలు" అని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియ కింద 18 ఏళ్లు పైబడిన అర్హులైన పౌరులందరినీ ఓటర్ల జాబితాలో చేర్చనున్నట్లు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ప్రకటించారు. అదే సమయంలో మరణించిన వ్యక్తులు, వేరే ప్రాంతాలకు తరలివెళ్లిన వారిని, విదేశీ ఓటర్లను ఓటరు జాబితా నుంచి తొలగిస్తున్నామని తెలిపారు. ఎస్ఐఆర్ దేశంలోని అత్యున్నత న్యాయస్థానం పరిశీలనను తట్టుకోవడమే కాకుండా తన రాజ్యాంగ, చట్టపరమైన విధిని నెరవేర్చడంలో కూడా అపారమైన విజయాన్ని సాధించిందని గుర్తు చేసుకున్నారు.కాగా, ఎస్ఐఆర్ ప్రక్రియపై జరిగిన న్యాయపోరాటంలో ఈసీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట దక్కింది. బిహార్‌లో చేపట్టిన ఎస్ఐఆర్ కసరత్తు రాజ్యాంగబద్ధమేనని, ఆ అధికారం ఈసీకి ఉందని సుప్రీంకోర్టు బుధవారం స్పష్టం చేసింది. చట్టాలను ఈసీ అతిక్రమించిందన్న వాదనలకు తిరస్కరించింది. రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ నిర్వహణ ఆవశ్యకతపై ఈసీ తెలిపిన కారణాలను సమర్థిస్తూ తీర్పునిచ్చింది.నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలన్న రాజ్యాంగ ఆదేశాలను ఎస్ఐఆర్ ముందుకు తీసుకెళ్తుందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ ధర్మాసనం పేర్కొంది. ఓటరు జాబితాలో పేరును తొలగించినంత మాత్రాన దేశ పౌరసత్వాన్ని కోల్పోయినట్లు కాదని వెల్లడించింది. ఓటర్ల జాబితా పౌరసత్వాన్ని నిర్ధారించే చట్టబద్ధమైన పత్రమేమీ కాదని అభిప్రాయపడింది. సాధారణ ఓటర్ల జాబితా సవరణ కంటే ఎస్ఐఆర్ భిన్నంగా ఉన్నంత మాత్రాన దీనిని కొట్టివేయలేమని తెలిపింది. ఎస్ఐఆర్ విషయంలో ఈసీ తన పరిధి దాటి వ్యవహరించలేదని స్పష్టం చేసింది.కాగా, గతేడాది జూన్‌లో ఈసీ బిహార్‌లో తొలుత ఎస్ఐఆర్ ప్రక్రియను చేపట్టింది. ఆ రాష్ట్రంలో ఏకంగా 65 లక్షల మంది పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326, ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950 నిబంధనల ప్రకారం ఇంత పెద్ద ఎత్తున ఎస్ఐఆర్ నిర్వహించే అధికారం ఎన్నికల కమిషన్‌కు లేదని పిటిషన్లు వేశారు. ఈ క్రమంలో సుప్రీంకోర్టు తాజాగా ఎస్ఐఆర్ నిర్వహించేందుకు ఈసీకి పూర్తి అధికారం ఉందని తీర్పునిచ్చింది.

# రాజస్థాన్‌లో ఇసుక తుఫాన్

మొదటిపేజీ తరువాయి..

ఎత్తున లేచిన ఇసుక మేఘాలు యావత్ ప్రాంతాన్నీ చుట్టేసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తీవ్రమైన ఇసుక తుపాను ముగిసిన వెంటనే వాతావరణం చల్లబడింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం తాత్కాలిక ఉపశమనం కలిగించినప్పటికీ,



అంతకుముందు సంభవించిన ఇసుక తుపాను సృష్టించిన బీభత్సం వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. అంతకుముందు శుక్రవారం కూడా రాజధాని జైపూర్‌లో ఇలాంటి భీకర వాతావరణమే కనిపించింది. నిన్న ధోల్‌పుర్ జిల్లాలో అత్యధికంగా 5.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో మారుతున్న ఈ వాతావరణ పరిస్థితులను భారత వాతావరణ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోంది. జైపూర్‌లోని వాతావరణ కేంద్రం తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌లో ఈ తరహా ఇసుక తుఫానులు, ఈదురు గాలులతో కూడిన వాతావరణం మరో నాలుగైదు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఇసుక తుఫాన్ కారణంగా రోడ్లు, వీధులు, హైవేలపై మొత్తం చీకటి కమ్మేసింది. బికనీర్ నగరం మొత్తం ఇసుక పొగతో నిండిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. స్థానికులు ఇళ్లు నుంచి బయటికి రాలేని పరిస్థితి నెలకొంది. ఇసుక దుమ్ముతో కూడిన గాలులు తీవ్రమవడంతో ఆ ప్రాంతంలో స్థానికులు భయంతో వణికిపోయారు. ఇసుక తుఫాన్ , తీవ్రమైన గాలులతో నగరంలో సాధారణ జన జీవనం ఒక్కసారిగా స్థంభించిపోయింది. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా కు నిలిచిపోయింది. షాపులు మూసివేశారు దుకాణదారులు. కొన్నిచోట్ల చెట్లు విరిగిపడ్డాయి.

## ఎంపీ అభిషేక్ బెనర్జీపై దాడి

మొదటిపేజీ తరువాయి..

సోనార్‌పుర్ వెళ్లిన ఆయనపై స్థానికులు రాళ్లు, కోడిగుడ్లు చెప్పులు విసిరారు. కొందరు ఆయనపై చేయి చేసుకున్నారు. అభిషేక్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ గో బ్యాక్ అంటూ దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. దాడి జరుగుతున్న సమయంలో అభిషేక్ బెనర్జీ హెల్మెట్ ధరించగా.. భద్రతా సిబ్బంది ఆయనకు రక్షణగా నిలిచారు. అనంతరం చిరిగిన చొక్కాతో ఆ ప్రాంతం నుంచి వెళ్లిపోయారు. ఈ క్రమంలో మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘటనకు భాజపానే కారణమని ఆరోపించారు. ముందస్తు ప్రణాళిక ప్రకారమే దాడి చేశారని.. తనను చంపేందుకు ప్రయత్నించారని అన్నారు. దాడి సమయంలో పోలీసులు ఎక్కడా కనిపించలేదన్నారు. ఈ ఘటనపై న్యాయపోరాటం చేస్తానని తృణమూల్ నేత పేర్కొన్నారు. అభిషేక్ బెనర్జీపై దాడి జరగడంపై ఆ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ బీజేపీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. 'పాలకులు హంతకులుగా మారుతున్నారు. బీజేపీకి ఇది సిగ్గుచేటు' అంటూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మండిపడ్డారు. 'అసెంబ్లీ ఎన్నికల సమయంలో చెలరేగిన హింసాత్మక ఘటనల్లో బాధితుడైన సంజు కర్మాకర్ కుటుంబాన్ని పరామర్శిస్తానని ఇచ్చిన మాటకు అభిషేక్ బెనర్జీ కట్టుబట్టారు. సోనార్‌పూర్ వెళ్లారు. బీజేపీ దన్నుతో కొందరు దుండగులు మా జాతీయ ప్రధాన కార్యదర్శిపై అమానుషంగా దాడి చేశారు. అయినప్పటికీ ఆయన బీజేపీ గూండాల దాడిలో నష్టపోయిన కుటుంబానికి అండగా నిలిచారు. కనికరంతో కూడిన రాజకీయాలకూ, విద్వేషంతో కూడిన రాజకీయాలకు ఉన్న తేడా ఇదే. సువేందు హయాంలో చోటుచేసుకుంటున్న



బెదిరింపులు, హింస, ప్రతీకార రాజకీయాలు మరోసారి ఇవాళ బహిర్గతమయ్యాయి' అని ఆ ట్వీట్‌లో మమత పేర్కొన్నారు. అభిషేక్ బెనర్జీపై శనివారం జరిగిన దాడిని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఖండించారు. ా ు జ క ీ య ం భేదాభిప్రాయాలున్నంత మాత్రాన హింసకు దిగడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. ఎన్నికల నేపథ్యంలో జరిగిన హింసాత్మక ఘటనల బాధితులను పరామర్శించేందుకు టీఎంసీ ఎంపీ శనివారం సోనార్‌పూర్ వెళ్లిన సందర్భంగా కొందరు కోడి గుడ్లు, రాళ్లతో దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడిని తాజాగా కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఎక్స్ వేదికగా ఖండించారు. ఆయనకు తగినంత పోలీసు భద్రత లేకపోవడాన్ని బట్టి బీజేపీ రాజకీయాలు, ప్రతీకారాలను అర్థం చేసుకోవచ్చని వ్యాఖ్యానించారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ప్రతిపక్ష నేతల భద్రత కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మరోవైపు, సమాజ్ వాదీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ కూడా అభిషేక్ బెనర్జీపై దాడిని ఖండించారు. తాము ఎంతటి ద్వేషపూరిత రాజకీయాలకైనా దిగగలమని బీజేపీ ఈ దాడితో రుజువు చేసిందని వ్యాఖ్యానించారు. సున్నిత ప్రాంతాల్లో కూడా పోలీసు భద్రత లేకపోవడం కుట్ర కోణాన్ని సూచిస్తోందని ఎక్స్ వేదికగా కామెంట్ చేశారు. బీజేపీ కార్యకర్తలే అభిషేక్ బెనర్జీపై దాడికి దిగారని టీఎంసీ ఆరోపించింది.

# పట్టణ పేదలకు పెద్దన్న రేవంత్ రెడ్డి కానుక

మొదటిపేజీ తరువాయి..

స్పష్టం చేశారు. శనివారం నాడు బంజారాహిల్స్‌లో నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సముదాయానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి పొంగులేటి మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం వలే ప్రజలు ఒకచోట ఇళ్లు 30-40 కిలోమీటర్ల అవతల ఉండేలా చేయబోమని , ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్ గా తీసుకొని ఏ నియోజకవర్గ ప్రజలకు ఆ నియోజకవర్గంలోనే ఇళ్లు నిర్మిస్తామని ఇది పేదలకు పెద్దన్న , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కానుకగా అందిస్తామని అన్నారు. రాష్ట్రంలో పేదవాని గుమ్మం వద్దకే ప్రజా ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామన్నారు. స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ , సర్వే తదితర శాఖలు ఒకే చోట అందుబాటులోకి తెచ్చేలా ఈ సమీకృత భవనాల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. తమ ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలలో భాగంగా మూడు కార్పొరేషన్ల పరిధిలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటు రంగానికి ధీటుగా కార్పొరేట్ తరహాలో అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. అంతేగాక ప్రభుత్వానిపై ఈ నిధుల భారం పడకుండా రియల్ ఎస్టేట్ నిర్మాణరంగంలో ప్రసిద్ధమైన సంస్థలకు నిర్మించే బాధ్యత అప్పగిస్తున్నామన్నారు. మరి కొద్ది నెలల్లో ఇక్కడ ఫినిక్స్ సంస్థ 30వేల చదరపు అడుగుల్లో ఈ భవనాన్ని పూర్తి చేసి ఇస్తుందని వెల్లడించారు. బంజారాహిల్స్ సమీకృత భవనంలో ఎస్.ఆర్. నగర్, బంజారాహిల్స్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు , డిఐజి కార్యాలయం, రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ - గోల్కొండ కార్యాలయాలు వస్తాయని వీటివలన ఈ ప్రాంత ప్రజలకు మరిన్ని ఉద్యోగ, వ్యాపార సౌకర్యాలు కలుగుతాయన్నారు. వందలాది సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో నమాజ్‌చేసుకుంటున్న ముస్లిం సోదరులకు ఏటా రెండు సార్లు నమాజు కార్యక్రమం నిర్వహించుకునేలా అధికారులను ఆదేశించామని ప్రకటించారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ అధ్యక్షత వహించగా ఎంపీ అనీల్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## ఇరాన్ వద్ద ఎప్పటికీ అణ్వాయుధాలు ఉండకూడదు

మొదటిపేజీ తరువాయి..

"అమెరికా ప్రయోజనాలకు అనుకూలంగా ఉండే, అధ్యక్షుడు ట్రంప్ నిర్దేశించిన రెడ్ లైన్స్‌ను సంతృప్తిపరిచే ఒప్పందానికే ఆయన అంగీకరిస్తారు. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధం కలిగి ఉండకూడదు" అని పేర్కొన్నారు. ఇదే సమయంలో ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ఇరాన్‌కు పలు షరతులు విధించారు. ఇరాన్ అణ్వాయుధాలు లేదా అణుబాంబు తయారీ దిశగా ఎప్పటికీ వెళ్లబోదని స్పష్టంగా అంగీకరించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని తక్షణమే అన్ని రకాల సుంకాలు లేకుండా రెండు దిశల్లోనూ నౌకా రాకపోకలకు తెరవాలని సూచించారు. జలసంధిలో ఎక్కడైనా సముద్ర గనులు (వాటర్ మైన్స్) మిగిలి ఉంటే వాటిని వెంటనే నిర్వీర్యం చేయాలని ట్రంప్ అన్నారు. ఇప్పటికే అమెరికా నౌకాదళం అనేక మైన్లను పేల్చి తొలగించిందని, మిగిలిన వాటిని ఇరాన్ తొలగించాలని పేర్కొన్నారు.

# కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్

మొదటిపేజీ తరువాయి..

పరమేశ్వర ఆయన పేరును సీఎల్‌పీ సమావేశంలో ప్రతిపాదించారని, ఏకగ్రీవంగా దీనికి ఎమ్మెల్యేలు ఆమోదం తెలిపారని వివరించారు. ముఖ్యమంత్రి మార్పు కాంగ్రెస్ పార్టీకి సమస్య అవుతుందని అంతా భావించారనీ, అయితే తమదంతా ఒక కుటుంబమని, అంతా ఏకగ్రీవంగా ఈ ఎన్నికను ఆమోదించడం పార్టీకి గర్వకారణమని అన్నారు. 2028లోనూ నాయకులందరికీ సపోర్ట్‌తో కర్ణాటకలో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాలతో సిద్ధరామయ్య ఈనెల 28న ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి డీకే శివకుమార్ సీఎం పగ్గాలు చేపట్టేందుకు మార్గం సుగమం చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగేంతవరకూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని సిద్ధరామయ్యకు గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ సూచించారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలన పూర్తి చేసుకుంది. ఇదిలావుంటే అంతకుముందు కర్ణాటకలో నాయకత్వ మార్పు పక్రియలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ పార్టీ శాసనసభా పక్ష నేతగా డీకే శివకుమార్ ఎన్నికయ్యారు. శనివారం సాయంత్రం విధాన సౌధలో జరిగిన సీఎల్పీ సమావేశంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు డీకేను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. శివకుమార్ పేరును మాజీ సీఎం సిద్ధరామయ్య ప్రతిపాదించగా సీనియర్ నేత పరమేశ్వర బలపరిచినట్లు తెలిసింది. మరోవైపు జూన్ 3న నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేయనున్నట్లు కర్ణాటక కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించింది. ఇందుకోసం బెంగళూరులోని లోక్‌భవన్ గ్లాస్ హౌస్‌లో ఏర్పాట్లు కూడా చేస్తున్నట్లు తెలిపింది.

# మోసపు హామీలతో గద్దెనెక్కి దగా

మొదటిపేజీ తరువాయి..

తమ ఎంపీలు, ఎమ్మెల్యేలు రైతుల దగ్గరికి వెళ్ళే వరకు మేలుకోలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానం గతంలో ఎలా ఉండేదో ఇప్పుడు అలానే ఉందని విమర్శించారు. రైతుల దగ్గర నుంచి కేంద్రం నేరుగా కొనదు.. మీ దద్దమ్మ తనం కేంద్రం మీద మోపుతున్నారని మండిపడ్డారు. దొడ్డు బియ్యం పండించే రైతుల పరిస్థితి ఏందని ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రైతులతో ఆడుకుంటున్నాయని.. ఈ ప్రభుత్వానికి కాంట్రాక్టులు, కమీషన్లు, భూ దందాల మీద ఉన్న దృష్టి రైతుల మీద లేదని విమర్శించారు. ఆ మంత్రి ఎంత ఈ మంత్రి ఎంత కమీషన్ తీసుకున్నారు.. నేనెంత తీసుకోవాలని చర్చిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. దేశ వ్యాప్తంగా విపరీతంగా ధాన్యం ఉత్పత్తి జరిగిందని.. ఎక్కడ గోదాంలు ఖాళీగా లేవని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. 'విదేశాలకు సప్లై చేయాలి అంటే ఫెస్టిసైడ్ వాడ కూడదు. క్షేత్ర స్థాయిలో ఆర్గానిక్ ఫార్మింగ్‌పై అవగాహన కల్పిస్తుందా? రైతుల ఉసురు తీసుకుంటుంది ఈ ప్రభుత్వం. ఆంధ్రప్రదేశ్‌లో ఈ సమస్య ఎందుకు లేదు. 6 నెలల ముందు గన్ని బస్తాలు తెచ్చుకుంటే ఏమయ్యింది. ఇక్కడ పండే సన్న బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు సప్లై చేస్తున్నారు. ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. తక్కువ ధరకు ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చి ఇక్కడ నాశి రకం సన్న బియ్యాన్ని పేద ప్రజలకి అందిస్తున్నారు. పేదలను, రైతులను మోసం చేస్తున్నారు. అందరికీ కేంద్రాన్ని విమర్శించడం అలవాటు అయింది.

# పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం

మొదటిపేజీ తరువాయి..




తన పూర్తి మద్దతును ప్రకటిస్తూ.. దేశ భవిష్యత్తును ఇలాంటి కుళ్ళిన, అసమర్థ వ్యవస్థల మీద ఎంతమాత్రం నిర్మించలేమని హెచ్చరించారు. ఈ మొత్తం వ్యవహారంలో గతంలో తెలంగాణను కుదిపేసిన ఒక చేదు జ్ఞాపకం మళ్లీ తెరపైకి వచ్చిందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. 2019లో తెలంగాణలో ఇంటర్మీడియట్ ఫలితాలను అస్తవ్యస్తం చేసి, పలువురు విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన 'గ్లోబరేనా' సంస్థే ఇప్పుడు కేవలం తన పేరును మార్చుకుని, సీబీఎస్ఈ నుంచి అంతకంటే పెద్ద కాంట్రాక్ట్‌ను దక్కించుకోవడం అత్యంత దురదృష్టకరమని మండిపడ్డారు. కేంద్ర బోర్డు నిర్లక్ష్యం వల్లే ఇప్పుడు దేశవ్యాప్తంగా ఇంత పెద్ద గందరగోళం నెలకొందని విమర్శించారు. నాడు గ్లోబరేనా వ్యవహారంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిం చిందని కేటీఆర్ గుర్తుచేశారు. లోపాలను వెలికితీసేందుకు తక్షణమే ముగ్గురు నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, ఆ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా తప్పు చేసిన సంబంధిత అధికారులను పదవుల నుంచి తక్షణమే తొలగించామని కేటీఆర్ వివరించారు. అంతేకాకుండా, బాధ్యురాలైన సదరు సంస్థపై కోర్టులో చట్టపరమైన క్రిమినల్ చర్యలు కూడా తీసుకున్నామని ప్రస్తావించారు. ఇంతటి చెడ్డ పేరు ఉన్న ఒక అసమర్థ సంస్థను సీబీఎస్ఈ బోర్డు ఎలా నమ్మిందని కేటీఆర్ ప్రశ్నించారు. కేవలం ఆ సంస్థకు లబ్ధి చేకూర్చేందుకే బోర్డు తన నిబంధనలను పదే పదే మార్చిందని ఆయన ఆరోపించారు. ఒక చిన్న పేరు మార్పు పక్రియతో పాత తప్పులను దాచిపెట్టి, లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో, భవిష్యత్తుతో ఆడుకోవడం క్షమించరాని నేరమని స్పష్టం చేశారు. నిరుద్యోగం, పరీక్షల లీకేజీలు, తప్పుడు మూల్యాంకనాలతో దేశంలోని విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టేస్తున్నారని, లక్షలాది మంది మానసిక క్షోభకు కారణమైన ఈ మార్కుల వివాదానికి కేంద్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి కచ్చితంగా దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. బాధితులైన విద్యార్థులకు పూర్తి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉండి పోరాడుతుందని కేటీఆర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

### మోటర్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో
# పోటీచేయను

మొదటిపేజీ తరువాయి..

తాము ఉచిత విద్యుత్ కొనసాగిస్తే.. బీఆర్ఎస్ ఎన్నికలకు దూరంగా ఉంటుందా అని సిఎం రేవంత్ సవాల్ విసిరారు. రైతుల ముసుగులో కేసీఆర్ రాజకీయ లబ్దికి యత్నిస్తున్నారని ఆరోపించారు. అన్నదాతలకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించేందుకే రైతు డిస్కం ఏర్పాటు చేస్తున్నాం. ఉచితంగా అందిస్తున్న విద్యుత్ వినియోగాన్ని దీనికి కనెక్ట్ చేస్తున్నాం. రైతు డిస్కంతో జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టాలని ప్రధాని మోడీ ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇది చెప్పకున్నా బిఆర్ఎస్ తన రాజకీయ లబ్ది కోసం పదేపదే దీనిని వాడుకుందని ఆరోపించారు. ఎపిలో కూడా జగన్ స్మార్ట్ మీటర్లు పెడతానని ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇకపోతే మేం ఏడాదికి రూ.70 వేల కోట్లు అప్పు చేస్తే.. రూ.95 వేల కోట్ల అప్పు తీరుస్తున్నాం. మేం తీరుస్తున్న అప్పుల గురించి హరీశ్‌రావు చెప్పడం లేదు. రూ.54 వేల కోట్లు అప్పులు తీసుకుంటామని ముందే చెప్పాం. ఎఫ్ఆర్‌బీఎం పరిధి దాటి అప్పులు చేయడానికి అనుమతి లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి వదిలేసిందే తప్ప ఒక్క గింజ కూడా కొనడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో వరి, జొన్న, మొక్కజొన్న పంటలను తమ ప్రభుత్వమే పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తోందని, ఇప్పటివరకు 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తడిచిన ధాన్యానికి సైతం మద్దతు ధర కల్పిస్తున్నామని, సన్న వడ్లకు బోనస్ ఇస్తామని భరోసా ఇచ్చారు. బీజేపీ నేతలు ఢిల్లీకి బస్సులు వేసుకుని వెళ్లి ధాన్యం కొనుగోలుకు ఒత్తిడి తేవలన్నారు. లేకుంటే తాము వారి ఇళ్ల ముందుకే ట్రాక్టర్లతో వడ్లు తెచ్చి పోస్తామని ఆయన హెచ్చరించారు. అంతర్రాష్ట్ర జల వివాదాలపై ప్రధాని మోదీ మాటలు చెబుతున్నా, తుమ్మిడిహట్టి కోసం మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆక్షేపించారు. కేంద్రంలోని భాజపా సర్కారు వడ్లు సరిగ్గా కొనుగోలు చేయడం లేదు. రాష్ట్రంలో 32 శాతం ధాన్యం మాత్రమే కొంటోంది. ధాన్యం కొనకపోతే భాజపా నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తాం. అంతర్రాష్ట్ర జలవివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని ప్రధాని మోదీ చెబుతున్నారు. ప్రాణహిత ప్రాజెక్టుపై మహారాష్ట్ర సీఎంతో చర్చలకు ప్రయత్నిస్తున్నాం. ఆయన ఎందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. హరీష్ రావు ఇదులకుంట చెరువు అక్రమాలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ ప్రాంతీయ, కుల వివాదాలు చేయడం బుద్ధిలేనితనమని, తన దృష్టి అంతా అభివృద్ధి పైనే ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ మీద ఒట్టేసి.. బీఆర్ఎస్‌లోనే ఉంటానని హరీశ్‌రావు చెప్పాలన్నారు. గతంలోనూ హరీశ్‌రావు.. వైఎస్సార్ దగ్గరికి వెళ్లారు. ఆయన ఎవరెవరితో మాట్లాడుతున్నారో నాకు తెలుసు.. కానీ చెప్పను.



ఇటీవల పార్టీ మీటింగ్ వదిలేసి ఆయన దిల్లీకి ఎందుకు వెళ్లారు? భాజపా, బీఆర్ఎస్‌లు కలిసి పోటీ చేస్తాయనడంలో అనుమానమే లేదు. సీబీఎస్ఈలో జవాబపత్రాలు తారుమారు చేసిన గ్లోబరీనా.. కేటీఆర్ బినామీ సంస్థ. గ్లోబరీనా సంస్థ కేటీఆర్ బినామీదేనని ఆరోపించిన సీఎం అదే ఇప్పుడు పేరు మార్చుకుందన్నారు. 2034 వరకు రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటాను. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, నాది విజయవంతమైన కాంబినేషన్. మేం అన్ని ఎన్నికలు గెలిచాం. భవిష్యత్తులోనూ విజయం సాధిస్తాం. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆయనకు మంచి పదవి రావొచ్చు. జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పుడే తొందర లేదు. ఎన్టీఆర్‌ను కులం, ప్రాంతంతో పోల్చడం బుద్ధిలేనితనం. పొట్టి శ్రీరాములు వర్సిటీకి సురవరం పేరు పెట్టిందే నేను. వివాదాలు, సెంటిమెంట్‌తో రాజకీయాలు చేయాలని అనుకోవడం లేదని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు.

## సర్పంచుల ఫోరం మండల కమిటీ ఎన్నిక

**సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులుగా కటికం వేణు**



**గరిడేపల్లి సికే న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు** భారీ నీటిపారుదల అండ్ సివిల్ సప్లై శాఖ మంత్రివర్యులు అయినటువంటి టైగర్ ఉత్తంకుమార్ రెడ్డి ఆశీస్సులతో

సూర్యాపేట జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు గుండు రామాంజి గౌడ్ అధ్యక్షతన జరిగిన గరిడపల్లి మండల సర్పంచ్లుల ఫోరం అధ్యక్షుని ఎన్నుకోవడం జరిగింది దీనికి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షునిగా కటకం వేణు పొనుగోడు సర్పంచ్ ఉపాధ్యక్షులుగా అరుణ రమేష్ ప్రధాన కార్యదర్శిగా కీసర వెంకటరమణ బుచ్చయ్య వీరు తోపాటు పాత కార్యవర్గాన్ని కొనసాగించడమైనది ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు త్రిపుర అంజన్ రెడ్డి మాజీ ఎంపీపీ కటికం ఆశా రమేష్ మాజీ ఎంపీపీ రంగనాథ్ మరియు వివిధ గ్రామ శాఖ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు పరమేశ్ సందీప్ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు

## అమ్మ ఒడి. బి అంగన్వాడి

**అంగన్వాడీ టీచర్ పోకల వెంకమ్మ**




**గరిడేపల్లి సి కె న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు** అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలను చేర్పించండి.పోషక ఆహార లోపం లేకుండా చూసుకోండి

రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలను ప్రత్యేక దృష్టితో చూస్తూ, అంగన్వాడీల బలోపేతానికి అధిక నిధులను కేటాయిస్తున్నందున, సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై వున్నదని అంగన్వాడీ టీచర్ పోకల వెంకమ్మ అన్నారు

గరిడేపల్లి మండలం లోని గానుగబండ గ్రామం లో ఈ రోజు అంగన్వాడీల ఆధ్వర్యంలో బడి బాట కార్యక్రమం ఘనంగా నిర్వహించినారుఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీలలో పిల్లలను చేర్పించడం ద్వారా అనేక రకాల ప్రయోజనం పిల్లలకు కలుగుతుందని,అంగన్వాడీ ల ద్వారా ప్రతి రోజు పిల్లలకు పౌష్టిక ఆహారం ఇస్తారని, పౌష్టికహారం తీసుకోవడం ద్వారా పిల్లలలో పోషకాహారం లోపం లేకుండా చూసుకోవచ్చునని, నర్సరీ విద్యను కూడా అందిస్తున్నందున అర్హులైన పిల్లలను అందరిని అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని ఆమె తల్లి తండ్రులను కోరారుఈ కార్యక్రమం లో అంగన్వాడీ టీచర్స్ పోకల వెంకమ్మ, అమరారపు సత్యవతి, జంగం అనిత,పిల్లల తల్లి తండ్రులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ 'రోలెక్స్' తనిఖీలు.

**సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బత్తిని శ్రీకాంత్ గౌడ్**




**గరేడేపల్లి సి కెన్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు** సూర్యాపేట జిల్లా ఎస్పీ శ్రీ నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు డాగ్ స్క్వాడ్ సిబ్బంది ఈరోజు శనివారం గరిడేపల్లి మండల కేంద్రశీలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గరిడేపల్లి ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ గంజాయి లాంటి మాదకద్రవ్యాల నిర్మూలణ గుర్తింపు లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ రోలెక్స్ తో మండల కేంద్రంలోని హోటల్స్, టీ దుకాణాలు, మెడికల్ దుకాణాలు, పాఠశాలలకు దగ్గర గల పాన్ షాపులు మరియు ఇతర దుకాణాలు, బహిరంగ ప్రదేశాలలో తనిఖీలు, సోదాలు నిర్వహించామని అన్నారు. ప్రస్తుత సమాజంలో గంజాయి లాంటి మాదకద్రవ్యం మన యువతని, సమాజాన్ని పట్టిపీడిస్తుందని, దీనిని తరిమికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. దీనిలో భాగంగానే విస్తృత తనిఖీలు నిర్వహించామని. డ్రగ్స్ కు సంబంధించిన సమాచారం పోలీసు వారికి ఇవ్వాలని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి విద్య, ఉపాధి మరియు మంచి భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యంతో పాటు కుటుంబాలు, సమాజం కూడా తీవ్రంగా నష్టపోతాయని తెలిపారు.

అనుమానాస్పద వ్యక్తులు లేదా మాదకద్రవ్యాల విక్రయాలు, రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీస్ లకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పేర్కొన్నారు.

ప్రజల సహకారంతో గంజాయి రహిత సమాజ నిర్మాణమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ తనిఖీల్లో డాగ్ స్క్వాడ్ సిబ్బంది, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

**అదనపు కలెక్టర్ వేణుగోపాల్.**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 30,**జూన్ 5 నుండి 12, 2026 వరకు నిర్వహించనున్న పదవ తరగతి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

శనివారం ఐ డి ఓ సి కార్యాలయం అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జూన్ 5వ తేదీ నుండి జూన్ 12వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 1,399 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారని, వారి కోసం నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణ కోసం నాలుగు మంది చీఫ్ సూపరింటెండెంట్లు, నాలుగు మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, నాలుగు సిట్టింగ్ స్క్వాడ్లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, ఫ్యాన్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మరుగుదొడ్లు, ప్రాథమిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు .

విద్యార్థులు పరీక్షలకు ముందురోజే తమ పరీక్షా కేంద్రాలను తెలుసుకోవాలని , పరీక్ష జరిగే రోజు కనీసం గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు.

పరీక్షల నిర్వహణలో విద్యుత్ సరఫరా, రవాణా, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు, తాగునీటి సదుపాయాల విషయంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పరీక్షలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి బి. నాగలక్ష్మి, వైద్యశాఖ ప్రతినిధి డా. టి. ప్రతాప్, విద్యుత్ శాఖ డీఈ పి.ఎస్.వి.ఎస్. నందయ్య, ఇల్లందు మున్సిపాలిటీ ప్రతినిధి డి. శ్రీనివాస్, ఆర్టీసీ ప్రతినిధి కె. మోహన్‌రావు, డీపీఓ కార్యాలయ ప్రతినిధి ఎస్. శ్రీనివాస్, పోస్టల్ శాఖ ప్రతినిధి ఎం.డి. అలీం, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ప్రతినిధి ఎం. అశోక్, పోలీసు శాఖ ప్రతినిధి పి.డి. క్రిస్టఫర్, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శంభు ప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ (పరీక్షలు) ఎస్. మాధవరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## అశ్వారావుపేటలో జిల్లా కలెక్టర్ అంకిత్ విస్తృత పర్యటన



- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాలు వేగవంతం చేయాలి.
- జూన్ 2 నాటికి ఇందిరమ్మ ఇండ్లు గృహప్రవేశాలకు సిద్ధం చేయాలిలి - జిల్లా కలెక్టర్ అంకిత్.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,మే 30,**అశ్వారావుపేట పర్యటనలో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ అంకిత్ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులు, తహసీల్దార్ కార్యాలయం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

అశ్వారావుపేటలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పనుల నాణ్యత, పురోగతి, భవనాల నమూనా మ్యాపులను పరిశీలించారు. విద్యార్థుల కు భవిష్యత్తులో అత్యుత్తమ విద్యా వాతావరణం కల్పించేలా అన్ని ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పాఠశాల ప్రాంగణానికి అనుసంధాన రహదారులు, అంతర్గత రోడ్లు, విద్యుత్ సరఫరా, తాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లల ఉజ్వల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను నిర్మిస్తోందన్నారు. ప్రపంచ స్థాయి విద్యను అందించి విద్యార్థులను భవిష్యత్ సవాళ్లకు సిద్ధం చేసే లక్ష్యంతో ఈ విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఐదు యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, నిర్ణీత గడువులోగా నాణ్యతతో పనులు పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం నాటికి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం అశ్వారావుపేట తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూ భారతి, సాదా బైనామా, భూ సర్వేలకు సంబంధించిన దరఖాస్తులు, వాటి పరిష్కార పురోగతిని తహసీల్దార్ కిషోర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను నిర్దేశిత సమయంలో పరిష్కరించి సకాలంలో సేవలు అందించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు.

అలాగే అశ్వారావుపేట మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. రైతులు తమ ధాన్యాన్ని విక్రయించే ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి రైతులకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ వారి సమస్యలు, ఫిర్యాదులను తెలుసుకున్నారు. ప్రజల వినతులను సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు .

అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాల పురోగతి, ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

అశ్వారావుపేట మండలంలో మొత్తం 957 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, వాటిలో 926 ఇండ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయని అధికారులు వివరించారు. వీటిలో 123 ఇండ్లు బేస్ లెవల్‌లో, 189 ఇండ్లు రూఫ్ లెవల్‌లో, 403 ఇండ్లలో స్లాబ్ పనులు పూర్తికాగా, 200 ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇంకా 31 ఇండ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో 136 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, 129 ఇండ్ల నిర్మాణాలు ప్రారంభమై, 52 ఇండ్లు పూర్తయ్యాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు.


ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పూర్తయిన మరియు చివరి దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను జూన్ 2వ తేదీన గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇంకా నిర్మాణాలు ప్రారంభం కాని ఇండ్లను వెంటనే గ్రౌండింగ్ చేసి పనులు ప్రారంభించాలని సూచించారు. లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక, పరిపాలనా సహకారం అందిస్తూ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.

ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని విజయవంతం చేయడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు. అలాగే ప్రభుత్వం చేపడుతున్న విద్యా, గృహ నిర్మాణ, రెవెన్యూ సేవల కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు.

ఈ పర్యటనలో తహసీల్దార్ కిషోర్, మున్సిపల్ కమిషనర్ దిలీప్ రెడ్డి, హౌసింగ్ ఏఈ మదన్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మత్స్య సహకార ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ

**--ఎన్నికల అధికారి వి.అశోక్ కుమార్**





**సీ కే న్యూస్ వలిగొండ మండలం, ప్రతినిధి బాలరాజు మే 30.** మత్స్య సహకార సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నామినేషన్ల స్వీకరణ అనంతరం నిర్దేశిత చివరి రోజున ఉపసంహరణ ప్రక్రియ జరుగుతుందని ఎన్నికల అధికారి సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ వి అశోక్ కుమార్ తెలిపారు శనివారం మండల పరిధిలోని ప్రొద్దుటూరు గ్రామంలో మత్స్య సహకార సంఘ భవనంలో ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్య సహకార సంఘం ప్రొద్దుటూరు గ్రామానికి ఈనెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడం జరిగిందని ఎన్నికల నోటిఫికేషన్ లో భాగంగా 21న సాధారణ సమావేశం నిర్వహించి నోటీస్ ఇవ్వడం జరిగిందని. ఎన్నికల విధి విధానాలను వివరించామన్నారు 3 రోజులు నామినేషన్లు వేశారని 78 మంది ఓటర్లకు 9 మంది పాలకవర్గ సభ్యులుగా దాసబోయిన రాజు. పెద్దబోయిన అభిరామ్. పెద్దబోయిన వెంకటేశం. పెద్దబోయిన సత్తయ్య. బుంగమట్ల నరసింహ. తాళ్ల సత్తయ్య. బోళ్ల శేఖర్. పెద్దబోయిన సీతారాములు. పెద్దబోయిన హరి. నామినేషన్లు వేశారని. స్క్రూట్ ని పూర్తయి 9 మంది పాలకవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని అన్నారు 1వ తారీకు సోమవారం రోజున ఆ సంఘ భవనంలో ఉదయం 9 గంటలకు 9 మంది సభ్యులు సమావేశానికి .హాజరై. అధ్యక్షులు .ఉపాధ్యక్షులు. కార్యదర్శిని. ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు

## గరిడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కరెంటు షార్ట్ సర్క్యూట్

**మండల వైద్యాధికారి డాక్టర్ నరేష్**



**గరిడేపల్లి సికె న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నరేష్ మాట్లాడుతూ శుక్రవారం వచ్చినఈదురు గాలుల వలన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కరెంట్ షార్ట్ సర్క్యూట్ జరిగిందన్నారు. తదుపరి ఎలక్ట్రిషన్ ను పిలిపించి మొత్తం చెక్ చేయించగా ఆసుపత్రిలో ఉన్నటువంటి ఫ్యాన్లు లైట్లు కాలిపోయాయని చెప్పారు. ఆస్పత్రిలో ఉన్నటువంటి మెడికల్ ఆఫీసర్ రూమ్, వార్డు మరియు ల్యాబ్,అదేవిధంగా చిన్నపిల్లల నిరోధక టీకాల యొక్క గదిలో కూడా షార్ట్ సర్క్యూట్ జరిగి కరెంట్ నిలిచిపోవడం జరిగింది.తాత్కాలికంగా మెడికల్ ఆఫీసర్ రూమ్ మరియు వ్యాధి నిరోధక టీకాల రూమ్ మరియు మీటింగ్ హాలుకు సప్లై ఇవ్వడం జరిగిందన్నారు.ఈ విషయం గురించి డాక్టర్ గారు జిల్లా అధికారులకు కూడా తెలియపరచడం జరిగింది.


## అమ్మ మాట అంగన్ బడి బాట




**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** మండల పరిధిలోని నరసింహాపురం గ్రామంలోని.. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో.. బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సూపర్వైజర్ విజయలక్ష్మి హాజరై..5 సంవత్సరంలోపు పిల్లలను అంగన్వాడీలో చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలు మంచి సౌకర్యాలు కల్పిస్తున్నది, అంగన్వాడి సేవలు వినియోగించుకోవాలని తెలిపారు..

ఈ కార్యక్రమంలో.. సర్పంచ్ లోయ ఉపేందర్, గ్రామ కార్యదర్శి సందీప్, అంగన్వాడి టీచర్స్ పద్మ, రేణుక, పిల్లలు,తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన, ఏ ఓ కవిత, ఎస్ ఐ చైతన్య కుమార్ రెడ్డి



**మే 30 (సి కే న్యూస్) చేగుంట** మాసాయిపేట పట్టణ కేంద్రం లో గల అగ్రోస్ ఫర్టిలైజర్ షాప్ ను, ఎస్ ఐ చైతన్య కుమార్ తో కలిసి తనిఖీ చేసిన మండల వ్యవసాయ అధికారి కవిత, అనంతరం షాపులో ఉన్న స్టాక్ రిజిస్టర్, లైసెన్స్ కాపీ లు,బిల్లు బుక్ లు,విత్తననిల్వ లు ,ఎరువుల నిల్వలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.ఎరువుల,విత్తన విక్రయాల్లో డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే రైతులకు రసీదు తప్పని సరిగా ఇవ్వాలని, బిల్లు పైన రైతు సంతకాలు తీసుకోవాలని, స్టాక్ బోర్డు,ధరల పట్టిక తప్పని సరిగా ప్రతి రోజూ రాయాలని వారు తెలిపారు,

# నాలుగు రోజులుగా తాగునీటి కష్టాలు.. ట్యాంకర్లతో నీటి సరఫరా

- మర్సుకుంట గ్రామంలో మిషన్ భగీరథ నీళ్లు అందని ద్రాక్షగా మారిన పరిస్థితి
- ప్రజల ఇబ్బందులను తాత్కాలికంగా తీర్చేందుకు పంచాయతీ చర్యలు



**సి కెన్యూస్ ప్రతినిధి ఇస్లావత్ నరసింహా ఏన్కూరు మే 30 2026:** ఖమ్మం జిల్లా ఏన్కూరు మండల పరిధిలోని సూర్య తండా గ్రామపంచాయతీకి చెందిన మర్సుకుంట గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. గత నాలుగు రోజులుగా గ్రామంలోని ఇళ్లకు నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పంచాయతీ అధికారులు ట్యాంకర్ల ద్వారా తాత్కాలికంగా నీటి సరఫరా చేపడుతున్నారు.

గ్రామంలో ఇంటి అవసరాలకు, తాగునీటికి, పశువుల అవసరాలకు నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు నీటి కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. పంచాయతీ సిబ్బంది ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ, అది గ్రామ ప్రజల అవసరాలకు పూర్తిస్థాయిలో సరిపోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు.

గ్రామ ప్రజల ప్రకారం, మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సరఫరా మొదటి నుంచే సక్రమంగా అందడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి గ్రామీణ ప్రాంతాలకు శుద్ధమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో మిషన్ భగీరథను అమలు చేసినప్పటికీ, మరుసుకుంట గ్రామంలో మాత్రం ఆ లక్ష్యం నెరవేరడం లేదని ప్రజలు చెబుతున్నారు.

ప్రస్తుతం గ్రామంలో విద్యుత్ మోటార్ల సహాయంతో నీటి సరఫరా నిర్వహిస్తున్నారు. అయితే తరచూ కరెంటు కోతలు ఏర్పడటం, సాంకేతిక లోపాలు తలెత్తడం, మోటార్లు సరిగా పనిచేయకపోవడం వంటి కారణాలతో నీటి సరఫరా అంతరాయం కలుగుతోంది. ఫలితంగా ప్రజలు నీటి కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు.

వేసవి తీవ్రత ఇంకా పూర్తిగా తగ్గని నేపథ్యంలో తాగునీటి సమస్య మరింత ఇబ్బందికరంగా మారిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, మిషన్ భగీరథ ద్వారా నిరంతర నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి సమస్యకు గల కారణాలను గుర్తించి, మర్సుకుంట గ్రామ ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందేలా తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా జరుగుతున్న సరఫరా తాత్కాలిక పరిష్కారమే తప్ప శాశ్వత పరిష్కారం కాదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

## నాగులవంచలో బడిబాట కార్యక్రమం.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలోని ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు.చిన్నపిల్లలందరినీ బడిలో చేర్పించాలని ర్యాలీనిర్వహించారు.కార్యక్రమంలోఅంగన్వాడి టీచర్స్ మణి, చంద్రకళ, ఆశ వర్కర్ నాగేంద్ర, సరస్వతి, గ్రామ ప్రజల పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

## కులం పేరుపెట్టి దూషించడం, చట్టనిత్య నేరం,డిప్యూటీ ఎమ్మార్వో రమేష్



**చేగుంట మండలం చందాయిపేట్ సి కే న్యూస్** గ్రామంలో, శనివారం నాడు చేగుంట తహసిల్దార్ శివప్రసాద్, సర్పంచ్ తాలూకా మహేశ్వరీ సాయిబాబా , ఆధ్వర్యంలో గ్రామంలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు, డిప్యూటీ తాసిల్దార్ మాట్లాడుతూ, ఎస్సీ కులస్తులను కులం పేరుతో దూషించిన, గుడిలో రాకుండా అడ్డుపడిన, వారి పైన, ఎస్సీ ఎస్టీ అట్రాసిట్ కేస్ కేసు నమోదు చేసి జైలుకు పంపించడం జరుగుతుందన్నారు, గ్రామంలో ఎవరైనా కులాంతర వివాహం చేసుకున్నట్లయితే వారికి ప్రభుత్వం తరుపున 50 వేల రూపాయలు నగదు., విదేశీ చదువుల. కొరకు రెండు లక్షల రూపాయలు ప్రభుత్వం ఇవ్వడం జరుగుతుంది, అన్నారు, ఈ కార్యక్రమం లో చేగుంట, ఆర్ఐ సుజాత, ఉపసర్పంచ్ నాగేష్ గుప్తా , మండల్ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, గ్రామ సెక్రెటరీ కృష్ణ , గ్రామ రెవిన్యూ ఆఫీసర్, రత్న కుమారి, హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య,మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొహమ్మద్ ముజామిల్,వార్డ్ సభ్యులు మధు, మహేష్,మహిళలు,గ్రామ ప్రజలు స్వామి గౌడ్, సిద్దిరాములు, బాబు, నర్సింలు ,తదితరులు పాల్గొన్నారు,

# పంచర్ షాప్ దగ్నం.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** మండల పరిధిలోని తిరుమలాపురం బస్టాండ్ (స్టేజి )వద్ద జీవనోపాధి సాగిస్తున్న తిమినేనిపాలెం గ్రామానికి చెందిన షేక్ బాబా షాప్ కు మొక్కజొన్న పంటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించారు .ఆ మంటలు చలరేగి బాబా పంచర్ షాప్ కు అంటుకొని షాపు పూర్తిగా దగ్ధమై జీవన ఉపాధి కోసం తెచ్చుకున్న సామాగ్రి ఎయిర్ కంప్రెసర్, బోల్ట్ మిషన్స్,టైర్లు, ట్యూబులు, పైపులు, తదితర సామాన్లు సుమారు లక్ష రూపాయలు వస్తువులు కాలిపోవడంతోకన్నీరు మున్నీరు అయ్యాడు .అధికారులు స్పందించి వేంటనే ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

# జూన్ 7న గచ్చిబౌలి స్టేడియంలో 'ఫిట్ ఇండియా--సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమం



**సి కె న్యూస్ ప్రతినిది:** జూన్ 6 న జరిగే క్రీడలు, ఫిట్‌నెస్ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచే లక్ష్యంతో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) ఆధ్వర్యంలో జూన్ 7న గచ్చిబౌలి స్టేడియంలో 'ఫిట్ ఇండియా--సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా ఆరోగ్యకర జీవనశైలిపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నారు.

ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. శాట్స్ వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ. సోనిబాలా దేవి, ఐఎఫ్ఎస్ శుక్రవారం లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి కార్యక్రమానికి ఆహ్వానించారు. గవర్నర్ ఆహ్వానాన్ని స్వీకరించి కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

సైక్లింగ్ ర్యాలీ ఏర్పాట్లపై ఎల్‌బీ స్టేడియంలోని శాట్స్ కార్యాలయంలో వివిధ సైక్లింగ్ సంఘాల ప్రతినిధులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి ఏర్పాట్లను ఖరారు చేశారు. 'ఫిట్‌నెస్ కి డోస్--ఆధా గంటా రోజ్' నినాదంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు, యువత, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సాధారణ ప్రజల్లో ఆరోగ్యం, ఫిట్‌నెస్, చురుకైన జీవన విధానంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

గచ్చిబౌలి స్టేడియం ప్రధాన ద్వారం నుంచి ప్రారంభమయ్యే సైక్లింగ్ ర్యాలీ ఐఐఐటీ జంక్షన్, గచ్చిబౌలి ఫ్లైఓవర్, పిస్తా హౌస్ జంక్షన్, బిట్స్, కేబుల్ బ్రిడ్జ్, మాదాపూర్, భారతీయ విద్యాభవన్ సెంటర్ రోడ్, బయోడైవర్సిటీ రోడ్ మీదుగా తిరిగి స్టేడియానికి చేరుకుంటుంది.

ఈ కార్యక్రమంలో సుమారు 2,000 మంది సైక్లిస్టులు పాల్గొనే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పాల్గొనే వారందరికీ తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ తరపున పతకాలను, సర్టిఫికెట్లు అందజేయనున్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ సోనిబాలా దేవి మాట్లాడుతూ సైక్లింగ్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేయడంతో పాటు పర్యావరణ హిత రవాణా విధానమని అన్నారు. కాలుష్యాన్ని తగ్గించడంలో, సుస్థిర జీవనశైలిని ప్రోత్సహించడంలో సైక్లింగ్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు, క్రీడాకారులు, ఉద్యోగులు, వివిధ సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ద్వారా సామాజిక అనుబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆమె తెలిపారు.

కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు నమోదు, ఇతర వివరాల కోసం గచ్చిబౌలి స్టేడియం అడ్మినిస్ట్రేటర్ కె. మధును 9000033100 నంబర్‌లో సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

## మంగళస్థానాలు వేడుకలు పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని మండల పరిధిలో తిర్లాపురం గ్రామంలోని గోదా రామారావు సరిత దంపతులకు కుమార్తె సుష్మా స్వరాజ్ వారి ఇంటి ఆవరణంలో మంగళ స్థానాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు తిర్లాపురం బిఆర్ఎస్ నాయకులు హాజరై సుష్మా స్వరాజ్ ను అక్షింతలేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు,తిర్లాపురం బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గోగుల నరసింహారావు, ఓయూ బి సి అధ్యక్షుడు గోదా రవీందర్, గోదా వెంకన్న, చాపల మడుగు సైదులు, సువర్ణ కంటి నాగేశ్వరావు, బంధువులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


# వీవోఏ ల సమ్మెకు తెలుగుదేశం పార్టీ మద్దతు.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట 12 రోజులుగా జఋఞ లు శాంతియుత నిరవధిక సమ్మె చేస్తున్న వారికి చింతకాని మండల తెలుగుదేశం పార్టీ బృందం సంపూర్ణ మద్దతు తెలియజేసినది ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు తేలుకుంట్ల శ్రీనివాస్ రావు మాట్లాడుతూ గత 28 సంవత్సరాలుగా చాలీచాలని 5000 రూపాయలు వేతనంతో గ్రామ దీపికలు పనిచేస్తున్నారని వారి కుటుంబాలు ఈ జీతాలు సరిపోక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని వారికి కనీస వేతనం నెలకు 20,000 రూపాయలు ఇవ్వాలని అలాగే సామాజిక భద్రత కింద వారి కుటుంబానికి బీమా సౌకర్యం వర్తింపచేయాలని సీనియర్లు గా పనిచేస్తూ హైయర్ ఎడ్యుకేషన్ నటువంటి వారిని ఐవతీఋా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఎందు సీసీలుగా ప్రమోషన్ ఇవ్వాలని జీవో నెంబర్ 58 ని సవరించాలని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వారి న్యాయమైన డిమాండ్లు పట్ల సానుకూలంగా స్పందించాలని ఆయన కోరారు ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు మరియు పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మాత్యులు వీరి యొక్క కనీస డిమాండ్లు నెరవేర్చి వీరిని ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో మండల తెలుగు రైతు నాయకులు పెంట్యాల రామారావు తెలుగుదేశం పార్టీ నాయకులు గురజాల మాధవరావు నెల్లూరు శేషగిరి మల్లాది వెంకట సుధాకర్ వంకాయలపాటి రాధాకృష్ణ తదితర నాయకులు పాల్గొని గ్రామదీపికలకు సంఘీభావం తెలిపినారు

## వలిగొండ పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ.



**సి కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు మే 29.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో ఉన్న పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అక్షాన్స్ యాదవ్ ఐపిఎస్ గారి ఆకస్మిక తనిఖీ నిర్వహించినారు.

ఎస్పీ మాట్లాడుతూ పెట్రోలింగ్ ప్రజా ఫిర్యాదులపై సిబ్బందికి కీలక ఆదేశాలు సూచించారు, శాంతిభద్రతల కాపాడుట ప్రజలకు రక్షణగా నిలవడమే మా ప్రధాన ప్రాధాన్యత అని అన్నారు, సిబ్బంది క్రమశిక్షణ స్టేషన్ పనితీరు, అత్యవసర సమయంలో స్పందించే విధానాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు, స్టేషన్లో రిసెప్షన్ కౌంటర్ క్రైమ్ విభాగం జనరల్ డైరీ జీవో నిర్వహణ, ఎస్పీ నిశితంగా పరిశీలించారు,పోలీస్ స్టేషన్ కు మొదట పెట్రోల్ కార్లు మరియు బ్లూ కోల్డ్ బిసి వాహనాల స్థితిగతులను వాటి పరిస్థితిని తెలుసుకున్నారు, వాహనాల్లోని వైర్లు కమ్యూనికేషన్ సెట్లు జిపిఎస్ వ్యవస్థలను పనితీరును అడిగి తెలుసుకున్నారు, పెండింగ్లో ఉన్న కేసులను పురోగతిపై సమీక్ష నిర్వహించారు, దర్యాప్తును వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా చార్జిషీట్లు దాఖలు చేయాలని సూచించినారు,దర్యాప్తు అధికారుల ను ఆదేశించినారు,నేరాలు జరగడానికి ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో బ్లూ కోల్డ్ మరియు పెట్రోల్ వాహనాలు నిరంతరం గస్తీ చేయాలన్నారు, ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెంచేల విజువల్ పోలీసింగ్ నిర్వహించాలని, స్టేషన్కు వచ్చే బాధితులకు తక్షణమే సహాయం అందించాలని, అర్హత గల ఫిర్యాదులపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయడంలో ఎలాంటి జాప్యం జరగకూడదని సూచించారు, ఈ కార్యక్రమంలో స్టేషన్ ఎస్ఐ మరియు సిబ్బంది పాల్గొన్నారు.ద

# ఎనుగుల పాపయ్య మృతి బాధాకరం.

వాకిటి అనంతరెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు,



**సి కె న్యూస్ వలిగొండ మండలం, ప్రతినిధి బాలరాజు మే 29.** వలిగొండ మండలంలోని గోపరాజుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎనుగుల పాపయ్య మృతి చెందడం బాధాకరమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి అన్నారు,శుక్రవారం పాపయ్య మృతి పట్ల ఘనంగా నివాళులు అర్పించారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ సలిగంజి పృధ్వి మాజీ ఉప సర్పంచ్ ఏనుగుల ఐలయ్య మండలసీనియర్ నాయకులు సామ రామ్ రెడ్డి బుర్ర నరసింహ జెల్ల నరేందర్ ఆవుల స్వామి సలిగంజి బిక్షపతి చిల్లర స్వామి తదితరులు పాల్గొన్నారు.

## చిన్నమండవ గ్రామ పంచాయతీలో అనధికార వ్యక్తుల అత్యుత్సాహం.. ప్రోటోకాల్ అంటే లెక్కలేదా? .

ప్రభుత్వ నిబంధనలను, ప్రజాస్వామ్య మర్యాదలను గాలికి వదిలేసి,



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చిన్నమండవ గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న వ్యవహారంపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నాం. జవీ=ఖీ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎన్నికైన స్థానిక సర్పంచ్‌కు కనీస సమాచారం ఇవ్వకుండా, ఎలాంటి బాధ్యత, అధికారిక పదవి లేని కొందరు పార్టీ నాయకులు చెక్కులు పంపిణీ చేయడం ఏమిటి?

ఇది అరాచకం కాక మరేంటి?

అధికార యంత్రాంగం ఉండి, ప్రోటోకాల్‌ను ఉల్లంఘిస్తూ ఇటువంటి 'ఒంటెద్దు పోకడ'లకు పాల్పడుతున్న ప్రైవేట్ వ్యక్తులకు,దళారులకు మద్దతు ఇవ్వడం అధికారుల నిస్సహాయతకు, అధికార పార్టీ తొత్తులుగా మారుతున్నారనడానికి నిదర్శనం.

ప్రజల కోసం రావాల్సిన నిధులను, అధికారిక పద్ధతుల్లో కాకుండా వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాడుకోవడం సిగ్గుచేటు.

ప్రభుత్వ నిబంధనలు (గ్రాతీశేశీఛశీశ్రీ =బశ్రీవం), పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ఎన్నికైన ప్రజాప్రతినిధిని కాదని ఇష్టారాజ్యంగా వ్యవహరించడం చట్టరీత్యా నేరం.

ఈ ఉల్లంఘనకు సహకరించిన అధికారులపై "సస్పెన్షన్" మరియు "శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలు" (ఐవజూఋతీఎవఝశ్రీ ాూషఱశీఅ) తీసుకునేలా ఉన్నతాధికారులకు, కోర్టుకు ఫిర్యాదు చేయడం జరుగుతుంది.

ఎలాంటి అధికారిక పదవులు లేకుండా ప్రభుత్వ కార్యక్రమాల్లో తలదూర్చి, అధికార దుర్వినియోగానికి పాల్పడిన స్థానిక నాయకులపై, మధ్య దళారులపై "క్రిమినల్ కేసులు" పెట్టడానికి కూడా వెనుకాడం.

ఇలాంటి పనులు మళ్ళీ పునరావృతమైతే, వచ్చే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయి. చట్టాన్ని, ప్రోటోకాల్‌ను గౌరవించడం నేర్చుకోండి, లేదంటే ప్రజాగ్రహంతో పాటు చట్టపరమైన చర్యలకు గురికాక తప్పదు.

ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

# ఢిల్లీకి చేరిన తెలంగాణ పంచాయితీ

కాంగ్రెస్ పార్టీ ఇటీవల జరిగిన ఎన్నికలలో కేవలం కేరళ రాష్ట్రంలో మాత్రమే అధికారంలోకి వచ్చింది. తమిళనాడు రాష్ట్రంలో అధికార పక్షంలో ఒక భాగమైంది. కీలకమైన పశ్చిమ బెంగాల్లో.. అస్సాంలో.. చిన్న రాష్ట్రమైన పుదుచ్చేరిలో అధికారాన్ని దక్కించుకోలేకపోయింది. కనీసం చెప్పుకునే స్థాయిలో శాసనసభ స్థానాలను దక్కించుకోలేకపోయింది .క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇలా ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఇప్పుడు వచ్చే వాళ్ళతో.. పోయే వాళ్లతో అత్యంత రద్దీగా ఉంది. రాహుల్ గాంధీ కూడా మల్లికార్జున కార్గే.. వేణుగోపాల్ రెడ్డి వంటి వారితో నిత్యం సమావేశాలు పెడుతున్నారు. ఏం జరిగి ఉంటుంది.. ఏం జరుగుతోంది అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నప్పుడే.. తెలంగాణ నేతలు అక్కడ కనిపిస్తున్నారు. కొద్దిరోజుల వరకు సాగిన కర్ణాటక పంచాయతీ డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావడంతో ముగిసింది. ఇప్పుడు మళ్లీ తెలంగాణ పంచాయతీ ప్రారంభమైంది. అలాగని తెలంగాణలో ముఖ్యమంత్రి మార్పు జరగడం లేదు. రేవంత్ రెడ్డి స్థానంలో కొత్త వ్యక్తిని ముఖ్యమంత్రిగా చేయాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అనుకోవడం లేదు.కాకపోతే కొంతమంది మంత్రులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు.. తమ శాఖలలో పిచ్చిపిచ్చి పనులు చేస్తున్నట్టు అధిష్టానానికి నివేదిక అందింది. ఇటీవల మీనాక్షి నటరాజన్ రాహుల్ గాంధీకి ఈ విషయాన్ని చెప్పినట్టు తెలుస్తోంది. దీంతో అధిష్టానం కొన్ని శాఖలలో ప్రక్షాళన చేయాలని భావించినట్టు వార్తలు వస్తున్నాయి. ఈ విషయం తెలిసిన కాంగ్రెస్ నాయకుడు వెంటనే ఢిల్లీ చేరుకున్నారు. మంత్రులుగా ప్రమోషన్ సాధించాలి అనుకునేవారు రాహుల్ గాంధీ ప్రాపకం కోసం పాకులాడుతున్నారు.వారిలో ఇప్పటికే గడ్డం ప్రసాద్ తనకు మంత్రి పదవి కేటాయించాలని రాహుల్ గాంధీకి వినతిపత్రం అందించిన తెలుస్తోంది. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి.. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి.. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వంటి వారు తమకు మంత్రి పదవులు ఇవ్వాలని రాహుల్ గాంధీకి విజ్ఞప్తి చేసినట్టు తెలుస్తోంది. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ కూడా తనకు మంత్రి పదవి ఇవ్వాలని రాహుల్ గాంధీని కోరినట్లు తెలుస్తోంది. కొంతకాలంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తనకు మంత్రి పదవి ఇవ్వాలని అధిష్టానాన్ని కోరుతున్నారు. ముఖ్యమంత్రిపై నేరుగా తన ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాలలో ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే విధంగా మాట్లాడుతున్నారు.మంత్రివర్గ ప్రక్షాళన జరుగుతుందని వార్తలు వస్తున్నా నేపథ్యంలో రాజగోపాల్ రెడ్డి రాహుల్ గాంధీ నివాసంలో గాని.. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గాని కనిపించడం లేదు. ఇంతవరకు విజ్ఞప్తులు అందించినట్టు కూడా సమాచారం అందడం లేదు. అంటే మంత్రివర్గ విస్తరణ ఉంటుందా.. లేక మీడియాకు కాంగ్రెస్ పార్టీ లీకలు ఇస్తోందా.. అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై మరింత స్పష్టత రావాలంటే మరికొంత సమయం పడుతుందని పొలిటికల్ ఎక్స్పర్ట్స్ అంటున్నారు.

**మంత్రుల మూగనోము..**

తెలంగాణ కాంగ్రెస్ మంత్రుల్లో సఖ్యత లేదు. ఎవరి పని వారే చేసుకుంటున్నారు. ప్రత్యర్థి పార్టీలు చేసే విమర్శలకు సయితం కనీసం మంత్రులు స్పందించడం లేదు. రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో ఇందరు మంత్రులు ఉన్నప్పటికీ ఇద్దరో, ముగ్గురో విపక్షాల విమర్శలకు స్పందిస్తున్నారు. అసలు బీఆర్ఎస్, బీజేపీలకు కౌంటర్ ఇచ్చే మంత్రి కేబినెట్ లో కనిపించడం లేదన్న విమర్శలు సొంత పార్టీ నుంచే వినిపిస్తున్నాయి. ఏదైనా ఉంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించాలే కాని, మంత్రులు ఎవరూ తమకు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లవుతున్నా మంత్రుల తీరులో మార్పు లేదు. వారి మౌనం ఎందుకన్నది ఎవరకి౿ అర్థం కాకుండా ఉంది.తెలంగాణ సంస్కృతిఎక్కడైనా ప్రభుత్వంపై విమర్శలు చేస్తే వెంటనే మంత్రులు ధీటుగా సమాధానమిస్తారు.

కానీ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం విభిన్నమైన పరిస్థితి. ఎవరి శాఖ వారిదే. తమ శాఖపై వచ్చిన ఆరోపణలను మాత్రమే వారు ఖండిస్తున్నారు. అదీ తప్పనిసరి పరిస్థితుల్లో కౌంటర్ ఇస్తున్నారు. ధాన్యం సేకరణపై బీఆర్ఎస్, బీజేపీ నేతలు విరుచుకుపడుతున్నప్పటికీ ఎవరూ స్పందించ లేదు. మరొకవైపు హరీశ్ రావు తాము అధికారంలోకి వస్తే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామన్న వ్యాఖ్యలను కూడా శ్రీధర్ బాబు మినహా మరెవరూ ఖండించకపోవడాన్ని

ఈ సందర్భంగా పలువురు గుర్తు చేస్తున్నారు. మంత్రుల మధ్య సమన్వయం లేకపోవడమే కారణమని అంటున్నారు.మరొకవైపు మంత్రుల్లో ఏదో తెలియని అసంతృప్తి కూడా ఉందన్న ప్రచారం పార్టీలో జరుగుతుంది. గాంధీ భవన్ కు వచ్చే మంత్రుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ఉన్న మంత్రుల్లో ఒకరిద్దరు మాత్రమే యాక్టివ్ గా కనిపిస్తున్నారు. మిగిలిన వారు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కోమటిరెడ్డి వెంకరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ వంటి సీనియర్ నేతలు కూడా మూగనోము పట్టడం ఎందుకన్న ప్రశ్న ఇప్పుడు కాంగ్రెస్ నేతలను వేధిస్తుంది. మొత్తం మీద కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏదో జరుగుతుందన్న ప్రచారం మరింత ఊపందుకుంది. ప్రభుత్వంపై వచ్చే విమర్శలను సమిష్టిగా ఎదుర్కొని సరైన కౌంటర్ ఇవ్వాల్సిన మినిస్టర్లు మౌనం వహించడంపై చర్చ జరుగుతుంది.

# నార్సింగిలో 'హైడ్రా' దూకుడు: ముష్కి చెరువు కబ్జాలపై ఉక్కుపాదం..

**భారీ పోలీస్ బందోబస్తు మధ్య కూల్చివేతలు, కంచె ఏర్పాటు**


హైదరాబాద్ పరిధిలోని చెరువుల సంరక్షణే ధ్యేయంగా ఏర్పడిన హైడ్రా అధికారులు శనివారం ఉదయాన్నే నార్సింగి లో మరో భారీ ఆపరేషన్ చేపట్టారు. ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి రంగంలోకి దిగిన హైడ్రా బృందాలు.. నార్సింగిలోని ప్రముఖ ముష్కి (ముష్కిన్) చెరువు పరిరక్షణ చర్యలను వేగవంతం చేశాయి.

**10 ఎకరాలు కబ్జా.. రియల్ వ్యాపారుల చేతుల్లో చెరువు స్థలం!**

మొత్తం 60 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ముష్కి చెరువులో, సుమారు 10 ఎకరాల మేర చెరువు స్థలం కబ్జాకు గురైనట్లు హైడ్రా అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పలువురు బిల్డర్లు చెరువు పరివాహక ప్రాంతాన్ని ఆక్రమించి పెద్ద ఎత్తున నిర్మాణాలకు పాల్పడినట్లు తేలింది. రంగంలోకి జెసిబిలు.. 'స్కైలా' అపార్ట్మెంట్ కాంపౌండ్ వాల్ కూల్చివేత!

**చెరువు ఎఫ్టీఎల్ (FTL), బఫర్ జోన్ పరిధిలో**

అక్రమంగా నిర్మించిన కట్టడాలకు అధికారులు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. ఇందులో భాగంగానే, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ప్రసిద్ధ 'స్కైలా' (హెచ్ఎశ్రీఘ) అపార్ట్మెంట్కు చెందిన కాంపౌండ్ వాల్ (రక్షణ గోడ)ను అధికారులు ఈరోజు ఉదయం జెసిబిల సహాయంతో నేలమట్టం చేశారు.50 ఎకరాలకు కంచె.. భారీ పోలీస్ బందోబస్తుఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా




మరియు స్థానికులు, బిల్డర్ల నుంచి ప్రతిఘటన ఎదురుకాకుండా ఉండేందుకు పటిష్టమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. భారీగా పోలీస్ బలగాలను మోహరించి, వారి బందోబస్తు మధ్య ప్రస్తుతం ఆక్రమణల తొలగింపు ప్రక్రియను కొనసాగిస్తున్నారు. కబ్జాల బారిన పడకుండా మిగిలిన సుమారు 50 ఎకరాల చెరువు స్థలానికి చుట్టూ ఇరిగేషన్, హైడ్రా అధికారులు సంయుక్తంగా శాశ్వత కంచె (Fencing) ఏర్పాటు చేసే పనులను యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తున్నారు.అధికారుల హెచ్చరిక: చెరువుల పరిరక్షణలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని, ఎంతటి వారైనా సరే ఎఫ్టీఎల్, బఫర్ జోన్పరిధిలోని అక్రమ నిర్మాణాలను వదిలిపెట్టేది లేదని అధికారులు స్పష్టం చేశారు. చెరువు కానుకొని ఉన్న విల్లాలు, పెద్ద భవనాల్లోని తాత్కాలిక గుడిసెలను తక్షణమే ఖాళీ చేయాలని హెచ్చరించారు.

# రైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడారు.మార్పు పేరుతో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల పాలన పూర్తిచేసుకున్నా, తెలంగాణ రైతుల జీవితాల్లో ఆశించిన మార్పు కనిపించడం లేదు. రైతాంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంలోనూ ఎలాంటి మార్పు కనిపించడం లేదు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ రైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్యంతో వ్యవహరిస్తోంది. రైతులసమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు.దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ప్రభుత్వం, రైస్ మిల్లర్లు, అధికారులు, దళారీల మధ్య రైతులు నలిగిపోతున్నారు. రైతు ప్రయోజనాలు పక్కనపడి వ్యవస్థ మొత్తం ఇతర ప్రయోజనాల చుట్టూతిరుగుతోంది. న్ని వనరులు ఉన్నప్పటికీ, ప్రభుత్వ చేతగానితనం మరియు సరైన కార్యాచరణ ప్రణాళిక లేకపోవడం వల్ల పంట చేతికొచ్చిన సమయంలోనే రైతులు వర్షాల బారినపడి నష్టపోతున్నారు.బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు 'రైతుల గోస -- బీజేపీ భరోసా' యాత్ర చేపట్టే వరకు కూడా కాంగ్రెస్ మంత్రులు కార్యాలయాల్లోనే పరిమితమయ్యారు. కొనుగోలు కేంద్రాల్లో ఎదురవుతున్న సమస్యలపై ప్రభుత్వం స్పందించకుండా కేవలం ప్రకటనలకే పరిమితమైందని అన్నారు.ధాన్యం కొనుగోళ్లు కేంద్ర ప్రభుత్వం చేయడం లేదని ముఖ్యమంత్రి, మంత్రులు విమర్శలు చేస్తున్నారు. అయితే ధాన్యం సేకరణ కేంద్రాల నిర్వహణ, కొనుగోళ్లు, రైస్ మిల్లులకు తరలింపు వంటి బాధ్యతలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు పంపాలి. మిల్లులు బియ్యంగా మార్చి ఎఫ్సీఐకి అందించాలి.ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లకు కలిపి 52.24 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎఫ్సీఐకి అందించేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల మధ్య ఒప్పందం కుదిరింది. అంటే దాదాపు 53 లక్షల మెట్రిక్ టన్నులధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కేంద్రం అంగీకరించింది. అలాంటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు పూర్తిస్థాయిలో కొనుగోళ్లు చేపట్టలేకపోయిందో సమాధానం చెప్పాలని అన్నారు.తమ బాధ్యతలను నిర్వర్తించకుండా కేంద్ర ప్రభుత్వంపై నెపం మోపడం సరికాదు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను కేంద్రంపై మోపే ప్రయత్నం జరుగుతోంది. గతంలో బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ రైతులజీవితాలతో చెలగాటం ఆడుతున్నాయి. రైతుల భవిష్యత్తుపై ఎలాంటి ముందుచూపు చర్యలు కనిపించడం లేదని అన్నారు.తెలంగాణలో కొనుగోలు చేసిన నాణ్యమైన సన్నబియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలించి, అక్కడి నుంచి తక్కువ నాణ్యత గల బియ్యాన్ని కొనుగోలు చేసి పేదలకు పంపిణీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.తెలంగాణ రైతుల ఉత్పత్తికి సరైన విలువ దక్కడం లేదు. ఇతర రాష్ట్రాల్లో అధిక ధరలకు అమ్మే బియ్యాన్ని తక్కువ ధరలకు కొనుగోలు చేసి, రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారు.బీఆర్ఎస్ హయాం నుంచి ప్రారంభమైన ఈ విధానం ఇప్పటికీ కొనసాగుతోంది. కొత్త వంగడాల అభివృద్ధి, సరఫరా విషయంలో కూడా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదు. అవసరానికి మించి ఉత్పత్తిజరుగుతున్నప్పటికీ మార్కెటింగ్ ప్రణాళికలు లేవని అన్నారు.ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి. అఖిలపక్ష సమావేశాలు నిర్వహించాలి. రైతు సంఘాలతో చర్చలు జరపాలి. మండల, జిల్లా స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి రైతుల సమస్యలకు పరిష్కార మార్గాలు అన్వేషించాలని అయన సూచించారు. **హైదరాబాద్ పెన్ పవర్:**

# సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా త్రివేణి సంగమంలో పుణ్యస్నానం

**కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే శ్రీగణేష్**

సరస్వతి నది అంత్య పుష్కరాల సందర్భంగా పవిత్ర గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతీ నదుల త్రివేణి సంగమం వద్ద కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ శుక్రవారం పుణ్యస్నానం ఆచరించారు. అనంతరం సంగమ క్షేత్రమైన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి ఆలయంలో దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితుల ఆశీర్వచనం అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉండాలని ఆ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని
ప్రార్థించానని తెలిపారు.

# 111 జీవో ఎత్తివేస్తామని మీకు హామీ ఇస్తున్నా.

# టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత



తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత శనివారం మొయినాబాద్ లో తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిష్కరించారు. కవిత మాట్లాడుతూ మొయినాబాద్, చేవెళ్ల ప్రజలందరికీ నమస్కారం. తెలంగాణలోకొత్త రాజకీయ శక్తిగా మనం పుట్టుకొచ్చాం. తెలంగాణ వస్తే అన్ని సమస్యలు పోతాయనుకుంటే అది జరగలేదు. ఆ లక్ష్యాలను సాధించుకోని, తెలంగాణ హక్కులను తెలంగాణ రక్షణ సేన పరిరక్షిస్తుంది. ఈప్రాంతంలో చూస్తే ఎకరాకు వందకోట్ల రూపాయలు పలుకుతున్న పరిస్థితి మనం చూస్తున్నామని అన్నారు.ఐతే 120 గ్రామాలకు సంబంధించి 111 జీవోను ఎత్తివేస్తే ఇక్కడి రైతులకు మేలు జరుగుతుంది. పిల్లల పెళ్లిళ్ల కోసం ఒక పావు ఎకరం అమ్ముకున్న మంచి ధర వచ్చే పరిస్థితి ఉంటుంది. కానీ 111 జీవో
ఎత్తివేస్తామని అన్ని పార్టీల వారు చెబుతున్నారు. అధికారంలోకి వచ్చాక పట్టించుకోవటం లేదు. తెలంగాణ రక్షణ సేన కచ్చితంగా అధికారంలోకి వస్తుంది. మేము 111 జీవో ఎత్తివేస్తామని మీకు హామీఇస్తున్నా. ఈ ప్రాంతంలో ఎక్కువ మంది రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉంటారు. ఈ గుంపుమేస్త్రీ నాకు రియల్ ఎస్టేట్ వ్యాపారమే బాగా తెలుసు అని చెప్పాడు. కానీ ఆ వ్యాపారాన్ని కూడాఊడగొట్టిండు. అందుకే గుంపు మేస్త్రీ పై పోరాటం చేయాల్సి ఉంది. చేవెళ్ల, మెయినాబాద్ ప్రజలు ఈ ప్రభుత్వం పై పోరాటానికి సిద్ధంగా ఉండాలి. మన పార్టీలోకి పెద్ద ఎత్తున మైనార్టీలు చేరారు. వాళ్ల చేరికతోమరింత బలపడ్డాం. ఇక్కడున్న గంగా, జమునా తెహజీబ్ సంస్కృతిని చెడగొట్టే వాళ్లకు సరైన బుద్ధి చెప్పాలి. తెలంగాణ వస్తే మన ఆడబిడ్డల జీవితాలు మారుతాయని అనుకున్నాం. కానీ అలా జరగలేదు.ఆడబిడ్డలకు కచ్చితంగా మంచి చేసేందుకు నేను పార్టీ పెట్టాను. ఒక ఆడబిడ్డ, మీ సోదరిగా నాకు మీ సమస్యలన్నీ తెలుసు. మన యువతకు కూడా ఉద్యోగాలు రావాల్సి ఉంది. కచ్చితంగా తెలంగాణ రక్షణసేన అధికారంలోకి వస్తుంది. అప్పుడు యువతకు అవసరమైన ఉద్యోగాలు కల్పిస్తాం. ఎలాంటి గ్యారంటీ లేకుండా వారికి 2 లక్షల నుంచి 20 కోట్ల వరకు రుణాలు అందిస్తామని అన్నారు.

# అమీర్‌పేటలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు హర్షణీయం:

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కాట్రగడ్డ ప్రసూన కృతజ్ఞతలు**

తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేసిన మహానాయకుడు, స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహాన్ని అమీర్‌పేట కూడలిలో ప్రతిష్టించడం పట్ల సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ అద్భుతమైన నిర్ణయాన్ని తీసుకుని, విగ్రహ ఏర్పాటుకు సహకరించిన గౌరవ తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి కి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు మరియు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాట్రగడ్డ ప్రసూన మాట్లాడుతూ.. "తెలుగు ప్రజల గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్న అన్న నందమూరి తారకరామారావు గారి విగ్రహాన్ని అమీర్‌పేట లాంటి ఒక ప్రధాన కూడలిలో ఏర్పాటు చేయడం తెలుగుజాతికి గర్వకారణం. ఎన్టీఆర్ కేవలం ఒక పార్టీకో, ప్రాంతానికో పరిమితమైన నాయకుడు కాదు.. ఆయన యావత్ తెలుగుజాతి ఆస్తి. అలాంటి మహానుభావుడి
సంస్మరణకు, వారి కీర్తిని సమున్నతంగా నిలపడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు చూపిన చొరవ, పెద్దమనసు నిజంగా అభినందనీయం" అని కొనియాడారు.రాజకీయాలకు అతీతంగా, తెలుగు
సంస్కృతిని, నాయకత్వ పటిమను రేవంత్ రెడ్డి దృక్పథం ఈ నిర్ణయంతో మరోసారి రుజువైందని ఆమె పేర్కొన్నారు. ఈ విగ్రహ ఏర్పాటు అమీర్‌పేట పరిసర ప్రాంతాల ప్రజలకే కాకుండా, నగరాసికులకు ఎంతో
సంతోషాన్ని ఇచ్చిందని ప్రసూన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## సంపాదకీయం

చరిత్రలో అరుదైన విచిత్రం భారత్‌లో ఆవిష్కృతమవుతోంది. స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి దశాబ్దాలపాటు భారత ప్రభుత్వాలు అనుసరించిన లక్ష్యం -జనాభా నిరోధం. "హమ్ దో, హమారే దో" నినాదం ఇళ్లగోడలపై రాసినా, సంతాన నియంత్రణకు ప్రోత్సాహకాలిచ్చినా, కొన్నిసార్లు బలవంతపు నిర్బంధ చర్యలకు దిగినా -కారణం ఒక్కటే.. అధిక జనాభా వలన కలిగే వనరుల కొరత, పేదరికం, అభివృద్ధి మందగమనం! ఆ ప్రయత్నాలు చివరికి ఫలించాయి, కానీ ఇప్పుడు కొత్త ప్రశ్న తలెత్తింది. అదే -లక్ష్యం సాధించిన తర్వాత ఏంచేయాలి? భారతదేశపు మొత్తం సంతానోత్పత్తి (టీఎఫ్ఆర్) రేటు దిగజారిందన్నది తాజా గణాంకాల మాట. దేశంలోని పట్టణ ప్రాంతాల టీఎఫ్ఆర్ కేవలం 1.5కి పడిపోయింది. ఇది జపాన్, దక్షిణ కొరియా, ఇటలీవంటి వయోజన దేశాల సంఖ్యకు దగ్గరగా ఉంది, అభివృద్ధి చెందుతున్న యువ దేశానికి కాదు. గ్రామీణ భారతం 2.1తో సరిగ్గా భర్తీస్థాయిలో నిలదొక్కుకున్నా, పట్టణీకరణ వేగం నేపథ్యంలో ఆ సంతులనం చాలాకాలం నిలబడదు. "జనాభా విస్ఫోటనం" భయంతో జీవించిన భారతం.. ఇప్పుడు "జనాభా కుంగుబాటు" అనే నిశ్శబ్ద సంక్షోభంలోకి అడుగుపెట్టింది. విజయం తెచ్చిన సంక్షోభమే -కళ్లముందు పెద్ద విచిత్రం!


సంతానోత్పత్తి రేటు కుంగుబాటు భారత్‌కేమీ ప్రత్యేకం కాదు. వేగంగా పెరుగుతున్న పట్టణీకరణవల్ల నివాస స్థలాలు కుచించుకుపోయాయి. జీవనవ్యయం ఆకాశాన్నంటింది. స్త్రీ విద్య, ఉద్యోగావకాశాలు విస్తృతమవ్వడం శుభపరిణామాలే అయినా... వీటి ఫలితంగా వివాహం, సంతానం ఆలస్యమౌతోంది. గర్భ నిరోధకాలు అందుబాటులోకి వచ్చాయి. అన్నింటికీమించి, ఆలోచనా విధానంలో వచ్చిన పెనుమార్పు. "ఎక్కువ పిల్లలకంటే ఒకరిద్దరితో మెరుగైన భవిష్యత్తు" అనే తత్త్వం వేళ్లూనుకుంది. ఇది అభివృద్ధి చెందిన ప్రతి దేశం దాటిన మలుపే. భారత్ ఆ మలుపును పట్టణాల్లో అంచనాకు మించిన వేగంతో చేరుకుంది. టీఎఫ్ఆర్ తగ్గడం స్వయంగా సంక్షోభం కాదు. నిజమైన ప్రమాదమున్నది పరివర్తన దశలో.. అది సమాజపు వయోజన నిర్మాణంలో చేసే తీవ్రమైన మార్పులో. భారతదేశం ఈ శతాబ్దపు మొదటి రెండు దశాబ్దాలలో "జనాభా డివిడెండ్" అనే అద్భుతమైన వరం అనుభవించింది. పని చేసే వయసు జనాభా అధికంగా ఉండటం, ఆధారపడే వృద్ధులు తక్కువగా ఉండటం. ఈ అనుకూల నిర్మాణమే భారత ఆర్థిక వ్యవస్థను వేగంగా ముందుకు నడిపింది. కానీ రాబోయే తరంలో ఈ చిత్రం తిరగబడుతుంది. పని చేసే జనాభా కుంచించుకుపోతుంది, వృద్ధ జనాభా విపరీతంగా పెరుగుతుంది. పింఛన్లు, వైద్య సేవలు, సామాజిక భద్రత సమకూర్చే బాధ్యత తక్కువ మంది పనిచేసే వారిపై పడుతుంది. ఇప్పటికే బలహీనంగా ఉన్న పింఛన్ వ్యవస్థ, ఆరోగ్య మౌలిక సదుపాయాలపై ఈ ఒత్తిడి అసాధారణ స్థాయికి చేరుతుంది.

రాజకీయ పరిణామాలు మరింత జటిలంగా మారే ప్రమాదముంది. భారత రాజ్యాంగం ప్రకారం పార్లమెంటు స్థానాల కేటాయింపు, కేంద్ర నిధుల పంపిణీ జనాభా ఆధారంగా జరుగుతాయి. దక్షిణాది రాష్ట్రాలు -ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్ణాటక జనాభా నియంత్రణలో దేశానికే ముందు నడిచాయి. మానవ వికాసంలో, స్త్రీ విద్యలో, ఆరోగ్యసేవల్లో అగ్రస్థానాల్లో నిలిచాయి.

### పిల్లల కోసం విలవిల

కానీ 2026లో జరగనున్న నియోజకవర్గాల పునర్విభజన ఈ రాష్ట్రాలకు ప్రతికూలంగా మారే అవకాశముంది. ఎందుకంటే జనాభా తక్కువగా ఉన్న రాష్ట్రాలకు తక్కువ పార్లమెంటు స్థానాలు వస్తాయి. అభివృద్ధిని సాధించినందుకు "శిక్ష" అనుభవించే ఈ అన్యాయమైన పరిస్థితి -ప్రాంతీయ వైషమ్యాలను మరింత లోతు చేస్తుంది. కేంద్ర-రాష్ట్ర సంబంధాలను దెబ్బతీస్తుంది. ఉత్తరాదిలో టీఎఫ్ఆర్ ఇంకా 2.5పైన ఉన్న రాష్ట్రాలు పార్లమెంటులో మరింత బలపడతాయి. ఇది ఫెడరల్ సమతుల్యతకు తీవ్రమైన సవాలు! అంతర్జాతీయ అనుభవాలు ఏం చెప్తున్నాయో పరిశీలిస్తే.. జపాన్, చైనా, దక్షిణ కొరియాలాంటి దేశాలు ఇప్పటికే ఈ సమస్యలో ఉన్నాయి. జపాన్ "విష్ణుమూర్తి" వంటి రోబో సంరక్షకులను తయారుచేసినా, దక్షిణ కొరియా లక్షల కోట్ల రూపాయల ప్రోత్సాహకాలిచ్చినా టీఎఫ్ఆర్ పెరగడం అంత సులభంగా జరగలేదు. చైనా "ఒక బిడ్డ" విధానాన్ని రద్దుచేసి "మూడు పిల్లలు" వరకూ అనుమతించినా ఫలితాలు నిరాశగా ఉన్నాయి. భారతదేశం ఈ అంతర్జాతీయ అనుభవాల నుండి పాఠాలు నేర్చుకోకపోతే, అదే తప్పులు పునరావృతమవుతాయి. కనుక ఇప్పుడు అవసరమైన వ్యూహం మూడు స్తంభాలపై నిలబడాలి. మొదటిది -తల్లిదండ్రుల పాత్రను ఆర్థికంగా సులభతరం చేయడం. పిల్లలను కనడం "ఆర్థిక శిక్ష"లా అనిపించే పరిస్థితి మారాలి. రెండవది -వృద్ధాప్య జనాభా సంక్షోభం రాకముందే సన్నద్ధం కావటం. సమర్థమైన పింఛన్ వ్యవస్థ, విస్తృతమైన వృద్ధాప్య ఆరోగ్య సేవలు, సీనియర్ సిటిజన్ల కోసం సామాజిక భద్రత ముఖ్యం. మూడవది -రాజ్యాంగపరమైన సంస్కరణ. నియోజకవర్గాల పునర్విభజనను జనాభా ఆధారం నుంచి మానవ వికాస సూచిక ఆధారంగా మార్చాలి. అభివృద్ధిని సాధించిన రాష్ట్రాలు పార్లమెంటులో బలహీనపడే పరిస్థితి ఏర్పడకూడదు; అది సాధించినందుకు బహుమతి ఇచ్చే సూత్రాలు రూపొందాలి. దీర్ఘకాలంలో చూస్తే, నిపుణ వలసదారులను ఆహ్వానించే సంస్కరణలు అవసరం కావొచ్చు. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియావంటి దేశాలు వలసదారుల ద్వారా తమ శ్రామికశక్తి కొరతను భర్తీ చేస్తున్నాయి. భారతదేశం సాంప్రదాయకంగా వలసలకు విముఖం. కానీ భవిష్యత్తులో ఆ వైఖరిలో సరళత అవసరమవుతుంది. అలాగే.. ఇప్పటికే 2.5 పైన టీఎఫ్ఆర్ ఉన్న రాష్ట్రాలలో నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉద్యోగ కల్పన వేగంగా విస్తరించాలి. ఆ రాష్ట్రాల జనాభా ఉత్పాదక శక్తిగా మారాలి. అది దేశమంతటికీ మేలు.

"జనాభా తగ్గించుకోవా"లని చెప్పిన ప్రభుత్వాలు, ఇప్పుడు "జనాభా తగ్గుతోంద"ని ఆందోళన చెందడం వైరుధ్యంగా కనిపించవచ్చు. కానీ విధాన నిర్ణేతలకు ఇది తప్పించుకోలేని వాస్తవం. జనాభా నియంత్రణ విజయం ఒక తరం పాటు దేశానికి సేవ చేసింది; ఇప్పుడు ఆ విజయం కొత్త సవాళ్లను తెచ్చింది. ఆ సవాళ్లను గుర్తించి, చురుగ్గా స్పందించే ప్రభుత్వాలు మాత్రమే భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్నట్టు లెక్క. ఈ మార్పును సమర్థంగా నిర్వహించకపోతే, సాధించిన విజయం శాపంగామారే ముప్పు లేకపోలేదు. అందుకే -ఇది గణాంకాల చర్చ కాదు; ఇది రాబోయే తరాల భవిష్యత్తు గురించిన అత్యవసర జాతీయ సంభాషణ!!



## జ్ఞానానికి ప్రేమే మూలం!

1828లో రష్యాలో సంపన్న కుటుంబంలో జన్మించిన లియో టాల్‌స్టాయ్ మొదట తుపాకీపట్టి యుద్ధభూమిలో నడిచారు. కానీ అదే చేతులతో కలాన్ని పట్టుకుని ప్రపంచ సాహిత్యాన్ని శాసించారు. 'వార్ అండ్ పీస్', 'అన్నా కరెనీనా' వంటి అజరామర నవలలు రాసిన ఆయన -కేవలం కథకుడు మాత్రమే కాదు, ఒక తాత్త్వికుడు, సంఘ సంస్కర్త, ఆధ్యాత్మిక దార్శనికుడు. ఆయన అహింస సిద్ధాంతాలు మహాత్మాగాంధీని నేరుగా ప్రభావితం చేశాయి. ఇద్దరి మధ్య ఉత్తరప్రత్యుత్తరాలు జరిగాయి, గాంధీజీ స్వయంగా టాల్‌స్టాయ్‌ను తన గురువులలో ఒకరిగా పేర్కొన్నారు. టాల్‌స్టాయ్ చెప్పిన ఒక మాట ఈ నాటికీ మనసును తాకుతుంది: "నాకు తెలిసిన ప్రతి విషయం, నేను అర్థం చేసుకున్న ప్రతిదీ కేవలం నేను ప్రేమించడం వల్లనే సాధ్యమైంది." 'వార్ అండ్ పీస్' నవలలో మరణశయ్యపై ఉన్న ప్రిన్స్ ఆంద్రూ ఆలోచనల ద్వారా టాల్‌స్టాయ్ ఈ సత్యాన్ని సున్నితంగా పలికించారు. జీవితపు చరమ ఘడియల్లో ఒక మనిషికి కలిగే స్పష్టత -అది తర్కం నుండి కాదు, ప్రేమ నుండే పుడుతుందని నిరూపించారు.

మనం సాధారణంగా అవగాహన అంటే సమాచారం, తర్కం, విశ్లేషణ అనుకుంటాం. కానీ టాల్‌స్టాయ్ దృష్టిలో అవి మెదడుకు సంబంధించిన పనులు మాత్రమే. హృదయానికి సంబంధించినవి కావు. ఒక వ్యక్తిపై నిజమైన శ్రద్ధ ఉన్నప్పుడే వారిలోని భయాన్ని, దాగున్న బాధను, చెప్పలేని ఆశలను మనం పసిగట్టగలం. ప్రేమ లేనిచోట మనం అవతలి వారిని అర్థం చేసుకోవడానికి ముందే తప్పు పట్టడానికి సిద్ధంగా ఉంటాం. ఒక తల్లి తన బిడ్డలో, ఒక గురువు తన శిష్యుడిలో చూసే లోతు -అది ప్రేమ ఇచ్చే కన్ను మాత్రమే చూడగలదు.

నేటి సోషల్ మీడియా యుగంలో ఈ పాఠం మరింత అవసరం. ఒక్క పోస్టు చూసి మనుషులపై ముద్రలు వేయడం, వాదనలో గెలవడం కోసం అర్థం చేసుకోవడం మానేయడం ఇవి నిత్యకృత్యాలుగా మారిపోయాయి. సంబంధాల్లో ఘర్షణలు వచ్చేది మాటలు వినిపించకపోవడం వల్ల కాదు, ఆ మాటల వెనుక ఉన్న నొప్పిని ప్రేమతో గుర్తించకపోవడం వల్లనే అని టాల్‌స్టాయ్ నమ్మారు. ఒక నాయకుడు తన ప్రజలను, ఒక అధికారి తన ఉద్యోగులను నిజంగా ప్రేమించగలిగినప్పుడే సమస్యల మూలాల వరకు చేరగలడు. ఆయన తన జీవితంలో కూడా ఈ విలువలను ఆచరించారు. భూస్వామి కుటుంబంలో పుట్టినా రైతుల పక్షాన నిలిచారు. అత్యంత ప్రసిద్ధుడైనా జీవితపు చివరి దశలో సర్వస్వాన్ని వదులుకుని సాదా జీవనం గడిపారు. రెండు శతాబ్దాల తర్వాత కూడా టాల్‌స్టాయ్ మాటలు మనకు గుర్తు చేస్తున్నాయి. నిజమైన జ్ఞానానికి మొదలు తర్కం కాదు, ప్రేమ!

టాల్‌స్టాయ్ జీవితం కేవలం సాహిత్యానికే పరిమితం కాలేదు. ఆయన స్వయంగా ఒక జీవన ప్రయోగశాల. తన భూమిని రైతులకు పంచిపెట్టాలని, బానిసత్వాన్ని రద్దు చేయాలని ప్రభుత్వంతో నేరుగా తలపడ్డారు. సంపదను, కీర్తిని తృణప్రాయంగా విడిచి 82 ఏళ్ల వయసులో ఇల్లు వదిలి వెళ్లిపోయారు. ఆ ప్రయాణంలోనే రైల్వే స్టేషన్‌లో తుది శ్వాస విడిచారు. చనిపోయే ముందు కూడా ఆయన నోట వెలువడిన మాట: "సత్యాన్ని వెతకడం మానకండి." రష్యన్ చర్చి ఆయన్ను మతం నుండి బహిష్కరించినా, ప్రజలు మాత్రం ఆయన్ను దేవుడిలా పూజించారు. ఇప్పటికీ ప్రపంచంలో అత్యధికంగా చదివే రచయితల జాబితాలో టాల్‌స్టాయ్ పేరు మొదటి వరుసలోనే ఉంటుంది, ఎందుకంటే ఆయన రాసింది కేవలం పాత్రల గురించి కాదు, మన గురించే.

# పంట పండించినా... పస్తులే!?

అప్పు చేసి విత్తు వేసి రేయింబవళ్లు కష్టపడి పండించిన పంట -అకాల వర్షానికి కళ్ల ముందే నీటిపాలవుతుంటే రైతు నిస్సహాయంగా చూస్తున్నాడు. ఇది ఈ ఏడాది మాత్రమే జరిగిన విషాదం కాదు; ఏటా తెలంగాణ సహా దేశమంతటా పునరావృతమయ్యే శోకగాథ. 35.77 కోట్ల టన్నుల రికార్డు ఉత్పత్తి సాధిస్తున్న భారతదేశంలో సగానికి పైగా పంటకు గిడ్డంగి సదుపాయమే లేదు; ఉద్యాన పంటలకు పది శాతానికి మాత్రమే శీతల నిల్వ అందుబాటులో ఉంది. పండించే శ్రమ రైతుది, నష్టమూ రైతుదే -లాభం మాత్రం దళారులది అనే చట్రం నుంచి భారత్ బయటపడలేకపోతోంది. పరిహారాలు ప్రకటించే ప్రభుత్వాలకంటే పరిహారమే అవసరం లేకుండా చేసే వ్యవస్థ కావాలి. పల్లెస్థాయి గిడ్డంగులు, శీతల గిడ్డంగుల విస్తరణ, కొనుగోలు కేంద్రాల్లో రక్షణ చర్యలు ఇప్పుడు అత్యవసరం. "ఏటా ఇదే దురవస్థ" అనే ఆవేదన ఆగాలంటే -వ్యవస్థాగత లోపాలను తక్షణం సరిదిద్దే రాజకీయ సంకల్పం చాటాల్సిన సమయం ఆసన్నమైంది!!



అప్పో సప్పో చేసి పెట్టుబడులు సమకూర్చుకుని పొలంలోకి దిగిన రైతు, పైరును కన్నబిడ్డలా సాకుతాడు. రేయింబవళ్లు రెక్కలు ముక్కలు చేసుకుంటాడు. "ఈసారైనా గట్టెక్కుతాం" అని ఆశతో ఎదురుచూస్తాడు. కానీ చేతికొచ్చిన పంట కళ్లముందే వర్షానికి తడిసి మురికిపాలైతే -ఆ అన్నదాత గుండె అవిసిపోవడానికి మాటలు చాలవు. దేశవ్యాప్తంగా ఏటా ఈ విషాదం పునరావృతమవుతోంది. తాజాగా తెలంగాణలోని పలు జిల్లాల్లో కురిసిన అకాల వర్షాలు మళ్లీ అదే గాయాన్ని చేశాయి. కల్లాల్లో, రోడ్ల పక్కన, కొనుగోలు కేంద్రాల్లో, మార్కెట్ యార్డుల్లో ఆరబోసిన ధాన్యం, మొక్కజొన్న తడిసి ముద్దయింది. కొన్నిచోట్ల వరదలో కొట్టుకుపోయింది. ఆరుగాలం శ్రమించిన రైతుకు మిగిలింది కన్నీరు మాత్రమే. ఇది ఒక సీజన్ దురదృష్టం కాదు -ఇది ఏళ్ల తరబడి పరిష్కారం కాని వ్యవస్థాగత వైఫల్యం.

పర్యావరణ విపరిణామాలతో వాతావరణం ఎప్పుడెలా మారుతుందో తెలియడం లేదు. ఉన్నట్టుండి కురిసే వర్షాలు, వరదలు, వడగళ్ల వానలు -ఇవన్నీ రైతుకు నిత్య శత్రువులుగా మారాయి. వాతావరణ మార్పు ఒకవైపు నిలిచి పాత పంచాంగాలను, రైతు అనుభవ జ్ఞానాన్ని పెళ్లగించేసింది. పండిన పంటను కాపాడుకోవడమే ఇప్పుడు అతి పెద్ద సవాలు. కానీ ఈ సవాలుకు స్పందించే మౌలిక సదుపాయాలు, విధాన చట్రం దేశంలో ఇంకా పూర్తిస్థాయిలో రూపుదిద్దుకోలేదు. ప్రభుత్వాలు ప్రతి ఏడాది నష్టపోయిన రైతులకు పరిహారం ప్రకటించడమే తప్ప, ఈ నష్టాలు మళ్లీ రాకుండా చేసే దీర్ఘకాలిక చర్యలు చేపట్టడంలో వెనకడుగు వేస్తున్నాయి. ఈ తేడాయే రైతు జీవితాన్ని అదే చక్రంలో బంధిస్తోంది.


ఒక విచిత్రమైన వైరుధ్యం భారత వ్యవసాయ రంగంలో స్పష్టంగా కనిపిస్తోంది. ఒకవైపు ఆహారధాన్యాల ఉత్పత్తి ఏటేటా రికార్డులు సృష్టిస్తోంది. 2024-25లో 35.77 కోట్ల టన్నులకు చేరింది. ఇది స్వాతంత్ర్యం వచ్చిన నాటికంటే పదిహేను రెట్లు ఎక్కువ. భారత రైతు అన్నప్రాశన చేయించిన దేశం ఆకలి సూచిలో క్రమంగా మెరుగుపడుతోంది. కానీ ఇంకోవైపు ఈ ఉత్పత్తిని సురక్షితంగా నిల్వ చేసే సదుపాయాలు విషాదకరమైన స్థాయిలో వెనకబడి ఉన్నాయి. దేశంలో కేవలం 47 శాతం ధాన్యానికి మాత్రమే గిడ్డంగి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ఉద్యాన పంటలు (పండ్లు, కూరగాయలు) విషయంలో పరిస్థితి మరీ దారుణం. కేవలం పది శాతానికి మాత్రమే శీతల గిడ్డంగి సదుపాయముంది. ఫలితంగా పెద్ద మొత్తంలో ఆహార పదార్థాలు పొలాల్లోనూ, నిల్వ కేంద్రాల్లోనూ చెడిపోయి వృథా అవుతున్నాయి.

ఉన్న గిడ్డంగులు ఉపయోగించుకుందామనుకుంటే అవి చిన్న రైతుకు రెండు కారణాల వల్ల అందుబాటులో ఉండవు. ఒకటి, వాటి అద్దె ఖర్చులు సాధారణ రైతులు భరించలేనంతగా ఉంటున్నాయి. రెండు, ఎక్కువశాతం గిడ్డంగులు జిల్లా కేంద్రాల సమీపంలోనే ఉంటున్నాయి. సన్నకారు రైతులు తమ పంటలను అంతదూరం తీసుకెళ్లడం ఆర్థికంగా, లాజిస్టిక్స్ రీత్యా కష్టతరం. దీంతో చాలామంది రైతులు మద్దతు ధర రాకముందే, సరైన మార్కెట్ దొరకకముందే పంటలు తెగనమ్ముకోవలసిన నిస్సహాయ స్థితిలో పడిపోతున్నారు. ఉత్పత్తి పెరిగినా రైతు ఆదాయం పెరగకపోవడానికి ఇది కూడా ఒక ప్రధాన కారణం. పండించే శ్రమ రైతుది, లాభం దళారులది. ఈ చక్రం విడిపోవడం లేదు.

ప్రభుత్వ స్పందన చూస్తే -అకాల వర్షాలు పడిన ప్రతిసారీ నష్ట సర్వేలు, పరిహార ప్రకటనలు వెలువడతాయి. కానీ ఈ చర్యలు రైతు గాయానికి వేసే తాత్కాలిక పట్టీలు మాత్రమే. పొలం దగ్గరే గిడ్డంగి సదుపాయం ఎందుకు లేదు? కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి సరైన కప్పు ఏర్పాటు ఎందుకు జరగలేదు? వర్షాలను ముందే పసిగట్టి రైతులను హెచ్చరించే సమర్థమైన వ్యవస్థ ఎందుకు పనిచేయడం లేదు? ఈ ప్రశ్నలకు ప్రతి ఏడాది జవాబు లేదు. ఎందుకంటే వ్యవస్థాగత మూలాలను పరిష్కరించే రాజకీయ సంకల్పం చాలాచోట్ల కొరవడుతోంది.

ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి? మొదటిది -పల్లె స్థాయిలో గిడ్డంగుల నిర్మాణం. రైతుకు పది, పదిహేను కిలోమీటర్ల దూరంలో నిల్వ సదుపాయం ఉంటే చాలు. ఆ ఒక్క మార్పే అన్నదాత జీవితాన్ని పూర్తిగా మార్చగలదు. ప్రైవేట్ పెట్టుబడిదారులను, సహకార సంఘాలను గ్రామాల్లో గిడ్డంగులు నిర్మించేందుకు ప్రభుత్వాలు పన్ను రాయితీలు, రాయితీ రుణాలతో ప్రోత్సహించాలి. రెండవది -శీతల గిడ్డంగుల విస్తరణ. పండ్లు, కూరగాయలు అతి తక్కువ కాలంలో పాడైపోతాయి. ఆధునిక కోల్డ్ చెయిన్ మౌలిక సదుపాయాలు ఉద్యాన రైతుల ఆదాయాలను రెట్టింపు చేయగల సామర్థ్యం కలిగి ఉన్నాయి. ఇందుకోసం ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం విధానాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి. మూడవది -కొనుగోలు కేంద్రాల్లో అత్యవసర రక్షణ చర్యలు. తేమ తట్టుకునే కప్పులు, త్వరితగతిన సమకూర్చగల ట్యార్పాలిన్ నిల్వలు, వర్షంముందే హెచ్చరించే స్థానిక వాతావరణ నెట్‌వర్క్ -ఇవి పెద్ద ఖర్చులేని చర్యలు. కానీ అమలులో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

భారతదేశం 35 కోట్ల టన్నులపైగా ధాన్యం పండిస్తోంది. కానీ ఆ ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేసే వ్యవస్థ లేకుండా ఈ ఉత్పత్తి రికార్డులు అర్థం కోల్పోతాయి. పండించడం విజయం, నిల్వ చేయడం నిర్లక్ష్యం -ఈ వైరుధ్యం కొనసాగినంత కాలం రైతు శ్రమ వ్యర్థమవుతూనే ఉంటుంది. అన్నదాత కష్టానికి విలువ ఇవ్వాలంటే.. పరిహారం ప్రకటించే ప్రభుత్వం కాదు కావలసింది, పరిహారం అవసరమే లేకుండా చేసే వ్యవస్థ కావాలి. "ఏటా ఇదే దురవస్థ" అనే ఆవేదన మళ్లీ వినరాదంటే, వ్యవస్థాగత లోపాలను తక్షణం పరిష్కరించాలి. రైతు మనుగడే దేశ మనుగడ. ఈ సత్యాన్ని విధాన రూపకర్తలు మరోసారి గుర్తుచేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది!! ■



బిస్కట్లు, చిప్స్‌వంటి చిరుతిళ్లు పక్కనపెట్టి బాదంతో చేసిన తినుబండారాలు అలవాటు చేసుకుంటే ఆరోగ్యానికి మేలు. బాదంలో ఉండే పీచు పదార్థం, ఆరోగ్యకరమైన కొవ్వులు పేగుల్లో మేలు చేసే బ్యాక్టీరియా పెరగడానికి దోహదపడతాయి. దీనివల్ల జీర్ణవ్యవస్థ బలోపేతమవుతుంది. అంతేకాకుండా శరీరంలో అనేక రకాల వాపు సమస్యలు తగ్గి రోగనిరోధక శక్తి మెరుగుపడుతుంది. కడుపు నిండిన భావనను కలిగించే హార్మోన్ల ఉత్పత్తి పెరగడం వల్ల అనవసరంగా తినే అలవాటు తగ్గి, అధిక బరువు సమస్య క్రమంగా అదుపులోకి వస్తుంది. చిరు ఆహారపు అలవాటులో ఈ చిన్న మార్పు దీర్ఘకాలంలో పెద్ద తేడా తీసుకొస్తుంది.

-మహాదేవ

వింతల్లో వింతలు

## ఉక్కు'చేతలు!



చైనాకు చెందిన కుంగ్‌ఫూ మాస్టర్ జాంగ్ లాంగ్‌జియాంగ్ చేతులు చూస్తే "ఇవి చేతులా, లేక ఇటుకలా?" అని అడగాలనిపిస్తుంది! 53 ఏళ్ల ఈ వ్యక్తి 20ఏళ్లు "అయరన్ శాండ్ పామ్" అనే పురాతన షావోలిన్ కుంగ్‌ఫూ విద్యను నిత్యం రెండు మూడు గంటలు సాధన చేశాడు. రోజూ ఉక్కు బంతులు నింపిన శాండ్‌బ్యాగ్‌ను 6,000 సార్లు కొట్టడమే దినచర్య! ఫలితం? అతని అరచేయి మందం 8 సెంటీమీటర్లు. సగటు మనిషి రెండు చేతులు అతికించినా సరితూగవు. ఆ చేతులతో ఇటుక పలకలు బద్దలు కొట్టడం, చెక్కలో మేకులు దిగగొట్టడం అతనికి చిటికె వేసినంత పని! "రహస్యమేమీ లేదు -సాధనే సర్వస్వం" అంటాడు జాంగ్. నిజంగా వారెవా!



# ఇరుముడిలో క్రేజీ సర్‌ప్రైజ్!

[illegible]

# స్మార్ట్ లుక్‌లోకి వచ్చేశాడుగా..




[illegible]

# హాట్ స్టార్!




యుక్తి తరేజా

# టాక్సిక్ సెట్‌లో అవి లేవు..!



[illegible]

## ప్రేమలు.. సీక్వెల్ ఆగిపోయిందట



[illegible]

# హీరో అజిత్‌కు మాతృవియోగం



[illegible]

# యాక్షన్ మోడ్‌లో కరిష్మా




[illegible]